సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 11.10.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 341
పేజీలు: 08 వెల: రూ. 5

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2.0

**డిసెంబరు 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహణ**

TELANGANA RISING GLOBAL SUMMIT
8 & 9 DECEMBER, 2025

- రూ.150 కోట్లతో ఏర్పాట్లు
- గూగుల్, టెస్లా సహా దిగ్గజ సంస్థలకు ఆహ్వానం
- 275 మందికి పైగా ప్రతినిధుల ఒకే
- పెట్టుబడులే లక్ష్యంగా దేశవ్యాప్తంగా రోడ్‌షోలు

02

## ప్రజాస్వామ్యానికి నిర్బంధాల సంకెళ్లు!

### కీలక నేతల అరెస్టులు

- ఢిల్లీలో సీజేపీ నిరసనపై ఉక్కుపాదం..
- జంతర్ మంతర్ చుట్టూ పోలీసు పహారా..
- 20 వేల మందితో భద్రతా వలయం
- మెట్రో స్టేషన్ల మూసివేత.. రైళ్ల రద్దు.. ఇంటర్నెట్‌పై ఆంక్షలు
- విమానంలో ఉండగానే సీజేపీ చీఫ్ దీప్కే సహా నేతల అరెస్ట్
- నేతలు జైల్లో.. ఉద్యమ బాధ్యతలు అజింక్య షిండేకు
- 'అరెస్టు చేస్తారని ముందే ఊహించా'.. దీప్కే వీడియోతో కలకలం



**ముద్ర, న్యూఢిల్లీ :**
దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల సెగ రాజకీయంగా వేడెక్కింది. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన ఆందోళనను అడ్డుకునేందుకు పోలీసులు భారీగా రంగంలోకి దిగారు. జంతర్ మంతర్ వద్ద నిరసనకు అనుమతి నిరాకరించడంతోపాటు, ఆందోళన ప్రారంభం కాకముందే పార్టీ కీలక నేతలను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు నిరసనకారులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందన్న అంచనాతో రాజధానిలో అసాధారణ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కేంద్ర బలగాలతో కలిపి 20 వేల మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించినట్లు సమాచారం. మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు, ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలతో ఢిల్లీలో సాధారణ జనజీవనంపైనా ప్రభావం పడింది. నిరసనను నిలువరించేందుకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తీసుకున్న చర్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

**విమానంలోనే నేతలకు పోలీసుల షాక్!**

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఢిల్లీ విమానాశ్రయంలో అనూహ్య పరిణామం ఎదురైంది. ముంబై నుంచి ఢిల్లీ చేరుకున్న ఆయన విమానంలో ఉండగానే పోలీసులు లోపలికి ప్రవేశించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆయనతోపాటు పార్టీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను కూడా నిర్బంధించినట్లు తెలుస్తోంది.
విమానం నుంచి ప్రయాణికులు దిగే వరకు వేచి చూడకుండా తమను అదుపులోకి తీసుకోవడంపై పార్టీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో పోలీసులకు, సీజేపీ సభ్యులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాన్ని దీప్కే తన ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో ప్రసారం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు, నిరసనలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు పలువురు కార్యకర్తలు, మద్దతుదారులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. రాత్రికి రాత్రే ఢిల్లీలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మందిని నిర్బంధించినట్లు సమాచారం. యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, సీజేపీ లీగల్ సెల్ హెడ్ రత్న సింగ్ విషయంలోనూ పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ పరిణామాలపై సంబంధిత అధికారుల వివరణ తెలియాల్సి ఉంది.

**20 వేల మంది పోలీసులతో భద్రతా వలయం**

జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసనకు పిలుపునివ్వడంతో ఢిల్లీ పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. కేంద్ర బలగాలతో కలిపి 20 వేల మందికి పైగా సిబ్బందిని మోహరించినట్లు నివేదికలు వెల్లడించాయి. జంతర్ మంతర్, జన్‌పథ్, ఎన్నికల సంఘం కార్యాలయం, పోలీసు ప్రధాన కార్యాలయం పరిసరాలను అత్యంత సున్నితమైన ప్రాంతాలుగా పరిగణించి నిఘా పెంచినట్లు సమాచారం. పలు అంచెల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి, సీసీటీవీ కెమెరాలు, బాడీ కెమెరాలతో పర్యవేక్షణ చేపట్టినట్లు తెలుస్తోంది. నిరసనకారులను అదుపులోకి తీసుకునేందుకు తాత్కాలిక నిర్బంధ కేంద్రాలను కూడా సిద్ధం చేసినట్లు వార్తలు వచ్చాయి. నిరసనకారులు అనుమతి లేకుండా ఒకచోట గుమిగూడకుండా చర్యలు చేపట్టారు. రాజధానిలోని కీలక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టమైంది. మిగతా 02లో



## ఢిల్లీ నిరసనల్లో హైడ్రామా

**మమత, కేజ్రీవాల్, పినరయి విజయన్ పోలీసుల అదుపులోకి!**

- ఈసీకి వ్యతిరేకంగా ఆందోళన.. విపక్ష నేతల అరెస్టులు
- నోటికి బ్యాండేజ్‌తో మమత నిరసన.. బస్సులో తరలింపు
- సీజేపీ ఆందోళనకు విపక్షాల మద్దతు.. రంగంలోకి పోలీసులు

**జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత**

02

## మోదీ ఎన్ని అరెస్టులు చేసినా వెనక్కి తగ్గేది లేదు

**ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పష్టం**



- రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తాం
- పోలీసులను ఎంతమందిని దించినా తమ ఉద్యమాన్ని ఆపలేరు
- యువత, నాయకుల అరెస్టులతో ప్రజల గొంతుకను అణచలేరు
- పదేళ్లలో దేశానికి జరిగిన అన్యాయాన్ని జరగనివ్వబోం: రాహుల్ గాంధీ

02



## ఎంగిలిపూల జాతర

- బతుకమ్మ పండుగ ప్రారంభం
- తొమ్మిది రోజుల పాటు కోలాహలం
- 18న ట్యాంక్ బండ్‌పై సద్దుల బతుకమ్మ

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలకు వేళైంది. ఊరూరా రంగురంగుల పూల సింగిడి పరుచుకోనున్నది. నేటి ఎంగిలిపూల బతుకమ్మతో మొదలయ్యే సంబురాలు తొమ్మిది రోజులపాటు అంబరాన్ని అంటనున్నాయి. ఇక సద్దుల బతుకమ్మ దాకా చిన్నా పెద్ద తేడా లేకుండా ఆడబిడ్డలంతా బతుకమ్మలను పేర్చి, ఆటపాటల్లో మునిగితేలుతారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా వాడలన్నింటినీ ఆటాపాటలతో హోరెత్తిస్తారు. ప్రభుత్వం సైతం ఈ ఏడాది బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. జిల్లా కేంద్రాలు, ప్రధాన కూడళ్లలో విద్యుత్ దీపాల అలంకరణతోపాటు చెరువులు, ఘాట్ల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.
బతుకమ్మ వేడుకల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి రూ.10 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. అదే విధంగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులను అధికారులు ముమ్మరం చేశారు. పల్లెల్లో చెరువులు, కుంటల వద్ద బతుకమ్మ ఘాట్ల ఏర్పాటుతోపాటు రహదారుల మరమ్మతులు చేయాలని పంచాయతీరాజ్‌శాఖ ఇప్పటికే ఆదేశించింది. ఘాట్ల చుట్టుపక్కల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి, విద్యుత్ దీపాలను అమర్చడం, ఘాట్ల వద్ద ప్రజల రక్షణ కోసం బారికేడ్లు, మెట్లు ఏర్పాటు చేయాలని మిగతా 02లో

### రోడ్ టెండర్లలో వేల కోట్ల కుంభకోణం

**సీఎంకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ**

- రేడియల్ రోడ్ టెండర్లలో రూ.3,296 కోట్ల కుంభకోణం!
- నచ్చిన సంస్థలకే కాంట్రాక్టులా? విచారణ జరపాలి
- ఐదు రోజుల్లోనే టెండర్ల ప్రక్రియ ఎలా పూర్తి చేశారు?



02

### దసరా పండుగ రద్దీ

**ప్రయాణికుల కోసం 7 వేల ప్రత్యేక బస్సులు**

- అక్టోబర్ 25 వరకు ప్రత్యేక రైళ్లు..
- కాజీపేట మీదుగా అదనపు సర్వీసులు



02

### ఈసీఐ నిర్ణయం

**ఫారం-7 దరఖాస్తులపై ఈసీఐ పరిమితులు**

- వ్యక్తికి గరిష్ఠంగా 10 మాత్రమే!
- ఓట్ల తొలగింపునకు కళ్లెం..
- బల్క్ దరఖాస్తులపై ఈసీ చర్యలు
- బీఎల్ఏలకు బ్రేకులు..
- రోజుకు 10 ఫారం-7లకే అనుమతి
- కొత్త నిబంధనలు జారీ



06

### ట్రంప్ కపటనీతి

**రష్యా చమురుపై ట్రంప్ యూటర్న్.. ద్వంద్వ వైఖరిపై విమర్శలు**

- భారత్‌పై సుంకాలు.. రష్యా డీజిల్ కోసం ఆరాటం
- ఇతర దేశాలకు ఆంక్షలు.. వారికి సహాయింపా?
- జాతీయ ప్రయోజనాలే ముఖ్యం..
- ట్రంప్ హెచ్చరికలను లెక్కచేయని భారత్



06

## హుందాతనం ఏదీ?

**తెలంగాణ రాజకీయాల్లో దిగజారుతున్న రాజకీయం**

- ప్రజా సమస్యలు పక్కకు.. వ్యక్తిగత దూషణలే ఎజెండా!
- కేటీఆర్ అనారోగ్యంపై రాజకీయ సెటైర్లు..
- సీఎం రేవంత్‌పై అసభ్య పోస్టులు
- సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల డిజిటల్ వార్!
- విధానాలపై చర్చేది? బురదజల్లుడే మిగిలిందా?
- లైకులు, వ్యూస్ కోసం దిగజారుతున్న రాజకీయ భాష!
- నేతల కుటుంబాలనూ వదలని సోషల్ మీడియా దాడులు
- ప్రత్యర్థులు శత్రువులు కాదు.. మారాలి రాజకీయ తీరు
- డిజిటల్ దూషణలకు అడ్డుకట్ట వేయాల్సిందే!



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణ రాజకీయాల్లో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన వేదికలు వ్యక్తిగత విమర్శలు, పరస్పర దూషణలు, సోషల్ మీడియా దాడులకు కేంద్రాలుగా మారుతున్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య విధానపరమైన విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ.. నాయకుల వ్యక్తిగత జీవితం, ఆరోగ్యం, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుంటున్న ప్రచార ధోరణి ఆందోళన కలిగిస్తోంది. ప్రజల సమస్యలపై చర్చించాల్సిన రాజకీయ పార్టీలు.. డిజిటల్ వేదికల్లో పరస్పరం బురదజల్లుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**కేటీఆర్ అనారోగ్యంపై వ్యాఖ్యలు**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జ్వరం, అస్వస్థత కారణంగా రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకుంటున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. అయితే, ఆయన ఆరోగ్య పరిస్థితిపై కొందరు రాజకీయ మిగతా 02లో

**ఇదీ AI ముద్ర**



## దానిమ్మ ఆకుల్లో యాంటీఆక్సిడెంట్లు!

దానిమ్మ ఆకుల్లో పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్లు, టానిన్లు వంటి జీవసంబంధ సమ్మేళనాలు ఉంటాయి. వీటిలోని కొన్ని లక్షణాలను పరిశోధకులు అధ్యయనం చేస్తున్నారు. అయితే ఇవి మనుషులకు ఎలాంటి ప్రయోజనాలు అందిస్తాయో మరిన్ని పరిశోధనలు అవసరం.



# తీరొక్క పూల జాతర

(మొదటి పేజీ తరువాయి)

సూచించింది. ఇందుకు అవసరమైన నిధులను పంచాయతీల జనరల్ ఫండ్ లేదా ఇతర నిధుల నుంచి వినియోగించుకోవాలని ఆఫీసర్లను ఆదేశించింది.

**18న ట్యాంక్‌బండ్‌పై 'సద్దుల' సంబురం..**



హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించేందుకు ఆఫీసర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. 18న సాయంత్రం 4 గంటలకు తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపం నుంచి వేలాది మంది ఆడపడుచులతో భారీ బతుకమ్మ ర్యాలీ చేపట్టనున్నారు. అనంతరం సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ట్యాంక్‌బండ్ పై వేడుకలు నిర్వహిస్తారు. తర్వాత బతుకమ్మ ఘాట్, నెక్లెస్ రోడ్డు పరిసరాల్లో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ప్లాట్‌ఫారాలు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, హైదరాబాద్‌నగరంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆఫీసర్లు చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లను బతుకమ్మ ఆకృతులు, రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దనున్నారు. తెలంగాణ సాంస్కృతిక కేంద్రమైన ర వీంద్రభారతిలో పది రోజులపాటు ప్రత్యేక బతుకమ్మ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిం చనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ పర్యాటక, చారిత్రక ప్రాంతాల్లోనూ పండుగ వాతావరణం ఉట్టిపడేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలంగాణ ఖ్యాతి ని, మన ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం బతుకమ్మకు ప్రత్యేక లోగోను రూపొందిస్తుండడం విశేషం.

**పూల ధరలకు రెక్కలు..**

బతుకమ్మలను పేర్చేందుకు తంగేడు, గునుగు, సీతమ్మజడ, చామంతి, బంతి వంటి రకరకాల పూలను వాడుతారు.అయితే, ఈసారి ఎల్‌నినో ఎఫెక్ట్‌తో పూల దిగుబడి తగ్గిపోయింది. ముఖ్యంగా అడవులు, బీడు భూముల్లో గునుగు, తంగేడు లాంటి పూలు ఆశించిన స్థాయిలో పూయలేదు. ఫలితంగా మార్కెట్‌లో పూల రేట్లు అమాంతం పెరిగిపోయాయి. గతంలో ఉచితంగా లభించే అడవి పూలను కూడా ఇప్పుడు మార్కెట్లో డబ్బులు పెట్టి కొనాల్సిన పరిస్థితి వచ్చిందని మహిళలు వాపోతున్నారు. ముఖ్యంగా బంతి, చామంతి ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు.

**ఎంగిలిపూల బతుకమ్మ నేపథ్యం ఇదీ..**

ఆశ్వయుజ పాఢ్యమికి ముందు వచ్చేది పితృ అమావాస్య. దీనిని పెతరమావాస్యగా కూడా పిలుస్తారు. ఆరోజు పేర్చే బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మగా పిలుస్తారు. ఏ పండుగైనా చేయడానికి ముందు పెద్దలను తలచుకోవడం మన సంప్రదాయం. అందుకే పితృ అమావాస్య రోజున పెద్దలను తలుచుకుంటూ బతుకునివ్వమని వేడుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. సాధారణంగా పండుగలు, వ్రతాలు, నోముల సందర్భంగా శుచిశుభ్రతతో వంట చేసి, పూజానంతరం దేవుడికి నైవేద్యం సమర్పించి, ఆ తర్వాత భోజనం చేస్తుంటారు. కానీ, పెతరమావాస్య రోజు మాత్రం పూజ చేసి, భోజనానంతరం బతుకమ్మను పేరుస్తారు. గౌరమ్మను చేసి పూజిస్తారు. ఎంగిలి పడ్డాక బతుకమ్మను పూజిస్తారు. కాబట్టి ఈ రోజు పేర్చే బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మ అంటారు. ఆ తర్వాత తొమ్మిది రోజులు బతుకమ్మను పేర్చి ఆడుతారు. చివరిరోజు సద్దుల బతుకమ్మ, పెద్ద బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. ఆరో రోజు మాత్రం అరిష్టంగా భావించి ఆడడం మానివేస్తారు. ఇతర రోజుల్లో బతుకమ్మను పేర్చి ఆడడంతో పాటు ఆట అనంతరం స్త్రీలు రకరకాల వాయినాలను ఇచ్చిపుచ్చుకుంటారు.

(మొదటి పేజీ తరువాయి)

**మెట్రోలు బంద్.. రైళ్ల రద్దు.. ఇంటర్నెట్‌పైనా ఆంక్షలు!**

నిరసనను నియంత్రించేందుకు తీసుకున్న చర్యలు సామాన్య ప్రజలకూ ఇబ్బందులు కలిగించినట్లు సమాచారం. మధ్య ఢిల్లీలోని కీలక ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు నివేదికలు పేర్కొన్నాయి. పలు మెట్రో స్టేషన్ల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను మూసివేసినట్లు వార్తలు వచ్చాయి. రైళ్ల రద్దు, ట్రాఫిక్ మళ్లింపులతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. దాదాపు 30 మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సమాచారం. హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లపై నిఘా పెంచడంతోపాటు, కొన్ని ప్రాంతాల్లో మద్యం దుకాణాలను తాత్కాలికంగా మూసివేసినట్లు కథనాలు వెల్లడించాయి. పొరుగు రాష్ట్రాల అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు సమాచారం. ఈ ఆంక్షల పరిధి, అమలుపై అధికారిక వివరాలను సంబంధిత

## మోదీ ఎన్ని అరెస్టులు చేసినా వెనక్కి తగ్గం

**ముద్ర, న్యూఢిల్లీ :**

దశాబ్ద కాలంగా ప్రధాని నరేంద్ర మోదీ, ఆరెస్సెస్‌లతో తాను పోరాడుతూనే ఉన్నానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒక ప్రత్యర్థిని ఎలాగైతే పూర్తిగా అర్థం చేసుకుంటారో.. తాను వారిని అలా అర్థం చేసుకున్నానని చెప్పారు. సీజేపీ నిరసనల నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. "మోదీ జీ.. మీకు నచ్చినట్లు చేయండి. పోలీసులందరినీ రంగంలోకి దించండి. 10 వేలు.. 20 వేలు.. 50 వేలు.. ఇలా ఎంతమందినైనా సరే. నాయకులందరినీ.. యువతను.. ఇలా అందరినీ అరెస్టు చేయండి. కానీ.. మేమంతా మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం. దేశ ప్రజల గొంతుకను రక్షించుకుంటాం. గత 10–15 ఏళ్లలో దేశానికి జరిగిన అన్యాయం ఇక ఎప్పటికీ జరగకుండా చూస్తాం. ఈ ప్రభుత్వాన్ని, రాజ్యాంగంపై దాడి చేసిన వారిని ఓడించేలా కృషి చేస్తాం" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

# ప్రజాస్వామ్యానికి నిర్బంధాల సంకెళ్లు!

శాఖల ప్రకటనలతో నిర్ధారించాల్సి ఉంది.

**ఎందుకీ నిరసన?**

ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్నది సీజేపీ ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బాధ్యత వహించాలని, ఆయన తన పదవికి రాజీనామా చేయాలని పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్‌తో జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన చేపట్టాలని నిర్ణయించింది. అయితే నిరసనకు కేవలం మూడు రోజుల ముందే సమాచారం ఇచ్చారని, గతంలో నిర్వహించిన ఆందోళనల సందర్భంగా విధించిన షరతులను నిర్వాహకులు ఉల్లంఘించారని పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. శాంతిభద్రతలు, ప్రజా భద్రత, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని అనుమతి నిరాకరించినట్లు వెల్లడించారు. అనుమతి లేకపోయినా నిరసన చేపడతామన్న పార్టీ వైఖరితో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

**అరెస్టు తప్పదని ముందే ఊహించిన దీప్కే?**

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన అరెస్టు జరిగే అవకాశాన్ని ముందుగానే ఊహించినట్లు తెలుస్తోంది. శుక్రవారం రాత్రి ఆయన ఒక వీడియో సందేశాన్ని రికార్డు చేసినట్లు సమాచారం. నిరసనకు ముందే ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఆ వీడియోకు ప్రాధాన్యం ఏర్పడింది. విమానంలోనే తనను అదుపులోకి తీసుకున్న ఘటనను లైవ్‌లో ప్రసారం చేసినట్లు వచ్చిన కథనాలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. పార్టీ కీలక నేతలు అందుబాటులో లేకపోవడంతో నిరసనకు నాయకత్వం వహించే బాధ్యత సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి అజింక్య షిండేపై పడింది. 35 ఏళ్ల షిండే గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ యువజన విభాగంలో మహారాష్ట్ర కన్వీనర్‌గా, గోవా సహ ఇన్‌చార్జిగా పనిచేసినట్లు సమాచారం. ప్రస్తుతం సీజేపీలో సంస్థాగత కార్యకలాపాలను సమన్వయం చేస్తున్నారు. కీలక నేతల నిర్బంధాల మధ్య ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన సిద్ధమైనట్లు తెలుస్తోంది.

**వాంగ్‌చుక్ ఎక్కడ? మద్దతు లేదన్న ప్రచారానికి వివరణ**

సీజేపీ నిరసనలో పర్యావరణ కార్యకర్త సోనం వాంగ్‌చుక్ పాల్గొనకపోవడం చర్చకు దారితీసింది. ఆయన ఉద్యమానికి దూరంగా ఉన్నారంటూ ప్రచారం జరగడంతో, తాను ప్రస్తుతం ఏ పనుల్లో నిమగ్నమై ఉన్నారో వివరిస్తూ సందేశం విడుదల చేసినట్లు సమాచారం. లద్దాఖ్‌లో నీటి భద్రత కోసం కృత్రిమ హిమానీనదాల నిర్మాణం, హిమాలయాల్లో హిమానీనద సరస్సులు ఉప్పొంగి వరదలు సంభవించే ప్రమాదాన్ని ఎదుర్కొనే చర్యలపై దృష్టి సారించినట్లు ఆయన వివరించినట్లు తెలుస్తోంది. నిరసనలో పాల్గొంటున్న నేతలంతా ఐక్యంగా ఉండాలని, యువత ముఖ్యంగా జెన్ జెడ్ ఆందోళనల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ శాంతిని పాటించాలని వాంగ్‌చుక్ పిలుపునిచ్చినట్లు సమాచారం. ఆయన ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా ఉద్యమానికి మద్దతు లేదని భావించవద్దన్నది ఆయన సందేశంలోని ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

**ఆంక్షలపై చర్చ.. నిరసన కొనసాగుతుందా?**

ఒకవైపు నిరసనకు అనుమతి నిరాకరణ, మరోవైపు ముందస్తు నిర్బంధాలు, భారీ భద్రతా ఏర్పాట్లు.. ఈ పరిణామాలు పౌర నిరసనల హక్కు, ప్రజా భద్రత మధ్య సమతుల్యతపై చర్చకు దారితీస్తున్నాయి. శాంతిభద్రతలను కాపాడటం పోలీసుల బాధ్యత కాగా, తమ అభ్యంతరాలను శాంతియుతంగా వ్యక్తం చేయడం పౌరుల హక్కు. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యత ఎలా పాటించారన్నది కీలకంగా మారింది. కీలక నేతలు పోలీసుల అదుపులో ఉన్నప్పటికీ 'జంతర్ మంతర్ 2.0' పేరుతో నిరసనను కొనసాగించాలని సీజేపీ నిర్ణయించినట్లు సమాచారం. కొత్త నాయకత్వంలో పార్టీ తన ఆందోళనను ముందుకు తీసుకెళ్తుందా? నిర్బంధాలపై రాజకీయంగా ఎలాంటి స్పందన వస్తుంది? ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగం ఈ ఆరోపణలకు ఎలా సమాధానం ఇస్తాయి? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## ఢిల్లీ నిరసనల్లో హైడ్రామా..

**ముద్ర, న్యూఢిల్లీ :**

దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (CJP) చేపట్టిన ఆందోళనకు మద్దతుగా వెళ్లిన పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలోని సౌత్ అవెన్యూ ప్రాంతంలో మమతా బెనర్జీతో పాటు తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు ఎంపీలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని బస్సులో తరలించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ నోటికి బ్యాండేజ్ అంటించుకుని నిరసన తెలిపారు. పోలీసులు తమను బస్సులో తరలిస్తున్న సమయంలో మమతా బెనర్జీ వీడియో సందేశం విడుదల చేశారు. ప్రభుత్వం తమతో అనుచితంగా వ్యవహరిస్తోందని ఆమె ఆరోపించారు. ప్రజల గొంతుకను బలోపేతం చేసేందుకు ఇండియా కూటమి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసం చుట్టూ ఉదయం నుంచే పోలీసులు మోహరించారు . నిరసనలో పాల్గొనేందుకు బయటకు వచ్చినప్పుడు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఇక, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను అరెస్ట్ చేసి ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియానికి తరలించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సీజేపీ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ నిరసనకు పలు ప్రతిపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి.

# హుందాతనం ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యర్థుల మద్దతుదారులు అనుమానాలు వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టడం వివాదానికి దారితీసింది. దర్యాప్తు సంస్థల భయం వల్లే అనారోగ్యం పేరుతో విశ్రాంతి తీసుకుంటున్నారంటూ సాగిన ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఆరోగ్యానికి సంబంధించిన అంశాలను సైతం రాజకీయ విమర్శలకు ఉపయోగించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**సీఎం రేవంత్ రెడ్డిపైనా డిజిటల్ దాడులు**

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు బీఆర్ఎస్ మద్దతుదారులు, కాంగ్రెస్ వ్యతిరేక సోషల్ మీడియా హ్యాండిళ్లు అభ్యంతరకరమైన పోస్టులు పెడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యమంత్రి వ్యక్తిగత జీవితం, కుటుంబ సభ్యులపై అసభ్య వ్యాఖ్యలు, మార్ఫింగ్ చిత్రాలతో కూడిన కంటెంట్ ప్రచారం కావడం రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తోంది. ఇలాంటి పోస్టులపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదులు, కేసులు నమోదైనట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే, ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతి అంశంపై వాస్తవాలు, దర్యాప్తు వివరాలు విడివిడిగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**వ్యూస్ కోసం దిగజారుతున్న భాష?**

యూట్యూబ్ ఛానెళ్లు, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపులు రాజకీయ ప్రచారానికి కీలక వేదికలుగా మారాయి. అయితే, కొన్ని సోషల్ మీడియా ఖాతాలు లైకులు, వ్యూస్, రాజకీయ ప్రచారంలో పైచేయి సాధించడమే లక్ష్యంగా వ్యక్తిగత దూషణలకు దిగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రత్యర్థుల విధానాలు, పాలనాపరమైన నిర్ణయాలను విమర్శించాల్సిన చోట వ్యక్తిగత బలహీనతలు, కుటుంబ సభ్యులపై వ్యాఖ్యలే ప్రధానంగా కనిపిస్తున్నాయి. దీంతో విద్యుత్ సమస్యలు, నిరుద్యోగం, భూ సంబంధిత వివాదాలు, హైడ్రా చర్యలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై జరగాల్సిన చర్చలు వెనుకబడుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు నేరుగా సంబంధించిన అంశాల కంటే రాజకీయ నేతలపై వైరల్ పోస్టులకే అధిక ప్రాధాన్యం దక్కడం ప్రజాస్వామ్య చర్చల నాణ్యతపై ప్రభావం చూపుతోంది.

**ప్రత్యర్థులు శత్రువులు కాదు!**

రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాలు పరస్పరం విమర్శించుకోవచ్చు. కానీ ఆ విమర్శలు విధానాలు, నిర్ణయాలు, ప్రజాప్రతినిధుల పనితీరుకు పరిమితం కావాలి. వ్యక్తిగత దూషణలు, నిరాధార ఆరోపణలు, కుటుంబ సభ్యులపై అవమానకర ప్రచారం రాజకీయ విభేదాలను వ్యక్తిగత కక్షలుగా మార్చే ప్రమాదం ఉంది. అదే ధోరణి క్షేత్రస్థాయి కార్యకర్తల మధ్య ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం కూడా లేకపోలేదు.

**నాయకత్వం బాధ్యత తీసుకోవాల్సిందే!**

సోషల్ మీడియా విభాగాల కార్యకలాపాలపై పార్టీల అగ్రనాయకత్వం స్పష్టమైన నియంత్రణ, బాధ్యతాయుతమైన మార్గదర్శకాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ప్రత్యర్థులపై విమర్శలు చేయడంలోనూ కనీస రాజకీయ మర్యాద పాటించేలా కార్యకర్తలకు సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. అసభ్యకర పోస్టులను ప్రోత్సహించకుండా, నిరాధార ప్రచారాన్ని ఖండిస్తూ పార్టీలు స్పష్టమైన వైఖరి తీసుకోవాలి. తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ ప్రజా సమస్యలే చర్చకు కేంద్రంగా మారాలంటే.. నాయకులు, పార్టీలు, సోషల్ మీడియా కార్యకర్తలు తమ బాధ్యతను గుర్తించాలి. రాజకీయ పోరాటం సిద్ధాంతాలు, విధానాలు, ప్రజా ప్రయోజనాల చుట్టూ సాగినప్పుడే ప్రజాస్వామ్యానికి ప్రయోజనం చేకూరుతుంది. వ్యక్తిగత దూషణలతో ప్రత్యర్థిని కించపరచడం కంటే, ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపించడమే రాజకీయ నాయకత్వానికి అసలైన పరీక్ష.

## రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2.0

**ముద్ర, హైదరాబాద్:**

తెలంగాణాన్ని ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం తలపెట్టిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్–2.0' సన్నాహక పనులు వేగవంతమయ్యాయి. 'మీ పెట్టుబడులకు మాది భరోసా' అనే నినాదంతో, 'ప్లెడ్జ్ టు ప్లాట్ టు ప్లాంట్ టు పేరోల్ టు ప్రొడక్ట్' థీమ్‌తో ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నారు. డిసెంబరు 7 నుంచి 9 వరకు ఫ్యూచర్ సిటీలోని 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ప్రాంగణంలో నాలుగు హాళ్లలో ఈ ఈవెంట్ జరగనుంది. దాదాపు రూ.150 కోట్ల అంచనాతో టెండర్ల ప్రక్రియ చేపట్టారు. బహిరంగ ప్రాంగణ పనులను నవంబరు 15లోగా, ఇండోర్ ఏర్పాట్లను నవంబరు 30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

10 రంగాలకు చెందిన 25 ప్రముఖ కంపెనీలతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధుల కోసం హైదరాబాద్‌లో 1,000 హోటల్ గదులను కేటాయించారు. గత సమిట్‌లో కుదిరిన 75 అవగాహన ఒప్పందాల్లో ఇప్పటివరకు 22 అమల్లోకి వచ్చాయి. 19 ఒప్పందాలు భూముల కేటాయింపు దశలో ఉండగా, మిగిలినవి వివిధ పరిశీలనల్లో ఉన్నాయి.

గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, మెటా, అమెజాన్, టెస్లా, ఫైజర్, అదానీ, ఐటీసీ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలను సమిట్‌కు ఆహ్వానిస్తున్నారు. 275 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యేందుకు ఇప్పటికే అంగీకరించారు. ఆస్ట్రేలియా, దుబాయ్, అమెరికాతో పాటు దేశంలో చెన్నై(అక్టోబరు 14), బెంగళూరు (అక్టోబరు 15), ముంబయి (నవంబరు 3), అహ్మదాబాద్ (నవంబరు 4) నగరాల్లో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. అక్టోబరు 26–29 మధ్య దిల్లీలో సమిట్ కర్టెన్‌రైజర్ జరగనుంది. సదస్సులో తెలంగాణ జానపద కళలు, శాస్త్రీయ నృత్యాలు, హస్తకళలు, బతుకమ్మ ఉత్సవాలు, స్థానిక వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. ఈ సమ్మిట్‌కు అవసరమైన అనుమతుల ప్రక్రియలో సహకరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌కు లేఖ రాశారు.



## రోడ్ టెండర్లలో వేల కోట్ల కుంభకోణం

**ముద్ర, హైదరాబాద్:**

రేడియల్ రోడ్–2 టెండర్లలో 3,296 కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ అంశమై శనివారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. నచ్చిన సంస్థలకే కాంట్రాక్టులు కట్టబెట్టారని తక్కువ ధరకు బిడ్లు వేసిన సంస్థలను పక్కన పెట్టారు. ఐదు పని దినాల్లోనే టెండర్ల ప్రక్రియ ఎలా పూర్తి చేసారని లేఖలో ప్రశ్నించారు. టెండర్లలో రూ.600 కోట్ల నష్టం జరిగిందన్న ఆరోపణలపై విచారణకు డిమాండ్ రేడియల్ రోడ్–1 టెండర్లపైనా అనుమానాలున్నాయని టెండర్లను రద్దు చేసి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ కాంట్రాక్టులపై కాగ్ ప్రత్యేక ఆడిట్ జరపాలి. రేడియల్ రోడ్ల టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. అదే విధంగా ఇటీవల గజ్వేల్ MRO రైతుపట్ల వ్యవహరించిన తీరుపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సమస్యను పరిష్కరించాల్సింది పోయి బాధను ఎగతాళి చేస్తారా? రైతును పురుగుల మందు తాగి చావలేదా అని అడుగుతారా? అన్నదాతల పట్ల ఇంత అమానవీయంగా వ్యవహరిస్తారా? అని కేటీఆర్ మండిపడ్డారు.

# దసరా పండుగ రద్దీ

**ముద్ర, హైదరాబాద్:**

దసరా పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నగరం నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీ పెరిగింది. నగరంలోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పండుగకు సొంతూళ్లకు వెళ్లే వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) 7 వేల ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు రైల్వే శాఖ కూడా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చింది.

**బస్టాండ్లలో పెరిగిన రద్దీ**

దసరా సెలవులు, పండుగ వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య పెరిగింది. దీంతో ప్రధాన బస్టాండ్లు, బస్సు ఎక్కే ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్ కూడళ్ల వద్ద ప్రత్యేక బోర్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపిస్తూ ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది.

**అక్టోబర్ 25 వరకు ప్రత్యేక రైళ్లు**

దసరా పండుగ సందర్భంగా రైళ్లలోనూ ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటంతో దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక సర్వీసులను ప్రకటించింది. సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్–హైదరాబాద్ మార్గంలో అక్టోబర్ 25 వరకు మొత్తం 34 ప్రత్యేక రైలు సర్వీసులు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఈ సర్వీసులు కాజీపేట మీదుగా ప్రయాణించనున్నాయి. సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు వెళ్లే ప్రత్యేక రైలు మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 2.10 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. అక్కడి నుంచి ప్రయాణాన్ని కొనసాగించి సాయంత్రం 5.30 గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్‌కు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో సిర్పూర్ కాగజ్‌నగర్‌లో సాయంత్రం 6 గంటలకు బయలుదేరే రైలు రాత్రి 8 గంటలకు కాజీపేటకు చేరుకుని, రాత్రి 11.15 గంటలకు హైదరాబాద్ సిటీకి చేరుకుంటుంది. ఈ రైళ్లకు చర్లపల్లి, భువనగిరి, యాదాద్రి, జనగామ, కాజీపేట, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, ఆసిఫాబాద్ స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.



**ఢిల్లీకి వన్‌వే ఫెస్టివల్ స్పెషల్ రైళ్లు**

మరోవైపు ఉత్తర భారతదేశానికి వెళ్లే ప్రయాణికుల కోసం హైదరాబాద్–హజ్రత్ నిజాముద్దీన్, చర్లపల్లి–హజ్రత్ నిజాముద్దీన్ మధ్య వన్‌వే ఫెస్టివల్ స్పెషల్ రైళ్లను కూడా ప్రకటించారు. రైలు నంబర్ 07031 హైదరాబాద్ నుంచి రాత్రి 11.25 గంటలకు బయలుదేరి తెల్లవారుజామున 1.30 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. అలాగే రైలు నం. 07035 అక్టోబర్ 11న రాత్రి 11.55 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి తెల్లవారుజామున 2 గంటలకు కాజీపేటకు చేరుతుంది. ఈ ప్రత్యేక రైళ్లకు కాజీపేట, బల్లార్షా, నాగ్‌పూర్, ఇటార్సి, జబల్‌పూర్, కట్నీ, సత్నా, చిత్రకూట్ ధామ్ కర్వీ, బాందా, వీజీఎల్ ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

ప్రయాణికులకు ఊరట

పండుగ వేళ ఒకేసారి పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రయాణాలకు సిద్ధమవుతుండటంతో బస్సులు, రైళ్లలో రద్దీ పెరిగింది. ప్రత్యేక సర్వీసుల నిర్వహణతో ప్రయాణికులకు కొంత ఊరట లభించనుంది. ప్రయాణికులు బయలుదేరే ముందు రైళ్ల సమయాలు, టికెట్ లభ్యత, ప్రత్యేక సర్వీసుల వివరాలను అధికారిక ఆర్టీసీ, రైల్వే సమాచార మార్గాల్లో పరిశీలించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 11.10.2026
www.mudranews.in | @mudranews


## దానిమ్మ ఆకుల కషాయంతో ఒత్తిడి తగ్గుతుందా?

దానిమ్మ ఆకుల కషాయం తాగితే ఆందోళన తగ్గి, అరగంటలోనే నిద్ర పడుతుందనే వాదనలకు తగిన శాస్త్రీయ ఆధారాలు లేవు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి వ్యాయామం, ధ్యానం, తగినంత నిద్ర వంటి అలవాట్లు సహాయపడవచ్చు.



## ఓబీసీ కాలమ్ కోసం ప్రధానికి లేఖ రాస్తా: రాందాస్ అథవాలే

**ముద్ర, న్యూఢిల్లీ:** జాతీయ జనగణనలో ఓబీసీ కులగణన కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కు మద్దతు ఇస్తామని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి, ఆర్పీఐ జాతీయ అధ్యక్షుడు రాందాస్ అథవాలే హామీ ఇచ్చారు. ఈ అంశంపై త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాస్తానని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలోని ఓబీసీ ప్రతినిధుల బృందం ఢిల్లీలో అథవాలేను కలిసి వినతిపత్రం సమర్పించింది. ప్రతి ఓబీసీ కులానికి ప్రత్యేక కోడ్ కేటాయించి, జనాభా గణాంకాలను శాస్త్రీయంగా సేకరించాలని కోరింది. ఓబీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన వాటా దక్కాలంటే కచ్చితమైన గణాంకాలు అవసరమని జాజుల శ్రీనివాస్ గౌడ్ వివరించారు. బీసీల ఆకాంక్షలను ప్రధాని దృష్టికి తీసుకెళ్తానని అథవాలే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో 11 నుంచి దసరా మహోత్సవాలు



**ముద్ర, శ్రీశైలం:** శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఈవో ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు అన్ని కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించడంతోపాటు వైదిక కార్యక్రమాల్లో సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. లోకక్షేమం కోసం సహస్ర చండీ పారాయణ సహిత శతచండీ మహారుద్రయాగం నిర్వహించనున్నారు. ఈ నెల 19న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

## అభిజీత్ దీప్కే ఇంట విషాదం



**ముద్ర, న్యూఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఇంట విషాదం చోటుచేసుకుంది. ఆయన నానమ్మ సావిత్రి బాయి (85) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం మహారాష్ట్రలోని హింగోలి జిల్లా సంతుక్ పింప్రిలోని నివాసంలో మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. అభిజీత్ దిప్కే ప్రస్తుతం దిల్లీలో పోలీసుల అదుపులో ఉన్నందున సంప్రదించలేకపోయామని దీప్కే బంధువు ఒకరు తెలిపారు. ఆయన తల్లిదండ్రులకు సమాచారం అందించామని, వారు సంతుక్ పింప్రికి బయలుదేరారని చెప్పారు. మరోవైపు.. నానమ్మ మరణ వార్తను దిల్లీ పోలీసులు అభిజీత్ దీప్కేకు తెలియజేశారు. పోలీసుల అదుపులో ఉంటూ నిరసనను కొనసాగించాలా? లేదా అంత్యక్రియల కోసం తిరిగి వెళ్లాలా? అనేది ఇప్పుడు ఆయన నిర్ణయంపైనే ఆధారపడి ఉందని దిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. ఆదివారం ఉదయం 10 గంటలకు సావిత్రిబాయి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆగస్టు 15న హింగోలి జిల్లాలో 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమాన్ని ప్రారంభించినప్పుడు, ఆ తర్వాత మరోసారి అభిజీత్ తన నానమ్మను కలిశారని, 20–25 రోజులుగా ఆమెను కలవలేకపోయారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

## మౌలిక వసతుల కల్పనే లక్ష్యం: మంత్రి తుమ్మల



**ముద్ర, ఖమ్మం :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 9,12,13,14వ డివిజన్ల పరిధిలోని మధురానగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ నగర అభివృద్ధి, ప్రజల ఐక్యతపై కీలక వ్యాఖ్యలు చేశారు. నగరంలోని కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా, ప్రతి డివిజన్‌లోనూ సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. కేవలం ప్రభుత్వ యంత్రాంగంతోనే కాదు.. పౌరుల పూర్తి సహకారం, భాగస్వామ్యం ఉన్నప్పుడే నగరంలో సంపూర్ణ పరిశుభ్రత సాధ్యమవుతుందన్నారు. ఖమ్మం నగరంలో అన్ని మతాలు, కులాలకు చెందిన ప్రజలు ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా కలిసికట్టుగా, ఆనందంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## మెదక్‌లో దారుణం..
## తల్లిపై డీజిల్ పోసి నిప్పంటించిన కుమారుడు

ముద్ర, మెదక్ : మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఎల్లుపేట్‌లో దారుణం చోటు చేసుకుంది. మంత్రాలు చేస్తోందనే అనుమానంతో తల్లి సాయమ్మ(40)పై కన్న కొడుకే దాడి చేశాడు. ఆమెపై డీజిల్ పోసి నిప్పంటించాడు. కాలిన గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. నిందితుడు 18ఏళ్ల దుర్గేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# సర్ పేరుతో ఓట్ల చోరీపై సమగ్ర విచారణ జరపాలి

*** కేంద్ర ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ను అరెస్ట్ చేయాలి**






ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని,అక్రమంగా కోట్లాది మంది ప్రజల ఓట్లు తొలగించి ఓట్ల చోరీకి బాధ్యులైన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నాడు హైదరాబాద్ కేంద్రంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితుల ఆధ్వర్యంలో సత్యనారాయణ రెడ్డి భవన్ నుండి హిమాయత్ నగర్ వై జంక్షన్ వరకు జ్ఞానేష్ కుమార్ శవయాత్ర నిర్వహించారు.. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు పుట్ట లక్ష్మణ్, నేర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ.... ఓటు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని, ఆ హక్కును కాపాడాల్సిన బాధ్యత గల ఎన్నికల సంఘం వారే ఓట్ల చోరీ చేస్తున్నారని,ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారని, గతంలో స్వయం ప్రతిపత్తిగల సంస్థలైన ఈడీ, ఐటీ సంస్థలను అడ్డం పెట్టుకొని, ప్రతిపక్ష నేతలపై దాడులు చేయించిన బీజేపీ ప్రభుత్వం, నేడు ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకొని బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేసే వారి ఓట్లను, ఓటరు జాబితా నుంచి తొలగించడానికి కుట్రలు చేస్తున్నదని, దేశంలో 13 కోట్ల మందికి ఓటు హక్కు దూరం చేసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందాలని బిజెపి ఎన్నికల సంఘం ద్వారా పథకం రూపొందించిందని, సుప్రీంకోర్టు ఫారం 6 లో అదనపు డిక్లరేషన్ చేర్చడంపై అనుమతి ఇచ్చిందని ఎన్నికల సంఘం తప్పుడు ప్రచారం చేసిందని సుప్రీంకోర్టును సైతం జ్ఞానేశ్ కుమార్ తప్పు దోవపట్టించి బిజెపి మోడీ, అమిత్ షా కోసం ఎన్నికల సంఘం ప్రతిష్ట దిగజార్చాడని,చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలపై ఇప్పటికే సుప్రీంకోర్టు కూడా సీరియస్ అయిందని,18 సంవత్సరాల వారు ఓటు హక్కు పొందాలని రాజ్యాంగం చెప్తా ఉంటే, ఉన్న ఓట్లను తప్పుడు పద్ధతుల ద్వారా తొలగించి బిజెపికి లబ్ధి చేయాలని ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ ప్రయత్నాలు చేయడం విడ్డూరమని, జ్ఞానేష్ కుమార్ పూర్తిగా బీజేపీ ఎన్నికల ఏజెంట్ గా మారడని, ఎన్నికల కమిషన్ లో ఉన్న మిగతా ఇద్దరి సభ్యుల అభిప్రాయాలను తీసుకోకుండా ఇష్టానుసారంగా జ్ఞానేష్ కుమార్ దేశంలో ప్రజల ఓట్లతో చెలగాటమాడుతున్నాడని, బంగారం, పైసలు, వాహనాల దొంగలను అరెస్టు చేసినట్టు ఓట్ల చోరీ చేసిన కేంద్ర ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని, జెన్ "జీ" యువత దేశంలో జరుగుతున్న పరిణామాలను అధ్యయనం చేస్తూ బిజెపి కుట్రలను తిప్పి కొట్టాలని , అక్రమంగా తొలగించిన 13 కోట్ల మంది ఓట్లను తిరిగి ఓటర్ జాబితాలో చేర్చాలని, జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలనీ నేడు ఢిల్లీ కేంద్రంగా సిజెపి ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపట్టాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టి అప్రకటిత ఎమర్జెన్సీ విధించడం జరిగింది. దేశ నలుమూలల నుండి విద్యార్థి,యువత దేశ రాజధానికి చేరుకోకుండా పోలీసులను అడ్డుపెట్టుకొని రైళ్లను ఆపివేయం మరియు రైల్లో ప్రయాణిస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేయడం లాంటి చర్యలు చేపట్టింది.ఢిల్లీలో మెట్రో రైళ్లను మరియు లాక్ డౌన్ విధించి సామాన్య ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయంలో సుప్రీం కోర్ట్ మొట్టికాయలు వేసిన ప్రభుత్వంలో చలనం లేదు. ఎన్ని అడ్డంకులు సృష్టించిన తమ పోరాటాన్ని ఆపేది లేదని వారు తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, మర్రి శ్రీమాన్ ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు గ్యార నరేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వంశీ వర్ధన్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు అనిల్, చైతన్య యాదవ్, హరీష్ , ఎండీ అన్వర్ నాయకులు జోసెఫ్ భాను, అరుణ్, నాయకులు అవినాష్, ఆంజనేయులు, ధ్రువ కుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు మహమూద్, సల్మాన్ ,మధు, బాలకృష్ణ, కళ్యాణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బావిలో దూకి తల్లీ, పిల్లలు ఆత్మహత్య!

**మహబూబాబాద్‌లో తీవ్ర విషాదం..**

**ముద్ర, వరంగల్ :** మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబా నికి చెందిన ముగ్గురు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడటంతో స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. లింగ్యా తండా–B గ్రామ పంచాయతీ పరిధిలోని సామ్యకుంట ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. కుటుంబ సమస్యలు లేదా ఇతర కారణాల వల్ల మనస్తాపానికి గురైన తల్లి బానోత్ అనూష, తన కుమారుడు నిశాల్ కృష్ణ, కూతురు వర్షిణితో కలిసి సమీపంలోని బావిలో దూకేసింది. నీటిలో మునిగి పోవడంతో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

ఒకే ఇంట్లో తల్లితో పాటు ఇద్దరు చిన్న పిల్లలు కూడా మృతి చెందడంతో తండాలో విషాదఛాయలు అలముకు న్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, ఆత్మహత్యకు గల అసలు కారణాలేంటనే దానిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు.

## కార్మిక హక్కుల సాధనే ఏఐటీయూసీ లక్ష్యం

**- కార్మికుల చైతన్యంతోనే విజయం**
**- సిపిఐ సీనియర్ నాయకులు డాక్టర్ కే నారాయణ వివరణ**
**- ఆర్టీసీలో ఎంప్లాయిస్ యూనియన్ గెలుపుపై ఏఐటీయూసీ కార్యాలయం వద్ద విజయోత్సవాలు**



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ ఆర్టీసీ లో పనిచేయుచున్న కార్మికుల చిరకాల కోరిక అయినా ప్రభుత్వం లో విలీనం విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఎంప్లాయిస్ యూనియన్ కృషి చేయాలని, కార్మికుల్ని మోసం చేసేందుకు ప్రభుత్వం చేసిన కుట్రాలను కార్మిక వర్గం విజ్ఞతతో తీపి కొట్టిందని సిపిఐ సీనియర్ నాయకులు డాక్టర్ కే నారాయణ వెల్లడించారు. శనివారం హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ యూనియన్ విజయం పట్ల ఏఐటీయూసీ నాయకులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి పెట్టి ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల డిమాండును నెరవేర్చాల్సిన అవసరం ఉన్నదని తెలియజేశారు. ఏఐటీయూసీ దేశంలో ప్రథమ కార్మిక సంఘం అనేక సంస్థలలో గుర్తింపు సంఘంగా కార్మికుల పక్షాన పోరాటాలు చేసి విజయాలను సాధించిన ఘనత ఉన్నదని వారు పేర్కొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ బాబు, ఈదురు వెంకన్న మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఆర్టీసీలో యూనియన్లకు గుర్తింపు లేకపోవడం వలన కార్మికులు అనేక కష్టాలను పడవలసిన దుస్థితి వచ్చిందని రాబోవు రోజుల్లో ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ పోరాటం నిర్వహిస్తుందని వారు పేర్కొన్నారు. కార్మికుల్ని కొన్ని సంఘాలు ప్రలోభాలకు గురిచేయాలని చూసిన కార్మిక వర్గం కనకక సమస్యలను పరిష్కారం చేసే యూనియన్ను ఎన్నుకోవడం కార్మిక విజ్ఞతకు నిదర్శనమని వారు పేర్కొన్నారు.

రాబోవు రోజుల్లో ఆర్టీసీ కార్మికుల సమస్యలన్నింటిపై పోరాటాలు చేసి హక్కుల్ని సాధిస్తామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వీఎస్ బోస్ ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షులు ఎండి యూసుఫ్ సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి వెంకటేశం ఎం నరసింహ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డి గోపాల్, జీడి ప్రసాద్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎస్ మూర్తి, మారగోని ప్రవీణ్ కుమార్, ఆటో యూనియన్ నాయకులు ఉమర్ ఖాన్, బిక్షపతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# కరెంట్ కొందామన్నా దొరకట్లేదు!

**- ఎల్‌నినో ముప్పుపై సీఎం రేవంత్ రెడ్డి అత్యవసర హెచ్చరిక! వర్షాభావ పరిస్థితులు.. ప్రభుత్వ చర్యలపై ఉన్నతాధికారులతో చర్చ**



**ముద్ర, హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ కొరత తీవ్రంగా మారే అవకాశం ఉంది. ఈ సంక్షోభాన్ని ముందే గుర్తించి తగిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో కోలుకోలేని దెబ్బ తింటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన, వచ్చే జూన్ వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

ప్రస్తుత పరిస్థితిలో విద్యుత్ సమస్య తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉంద ని సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. 'విద్యుత్ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ఎంత ఖర్చు చేయడానికైనా సిద్ధంగా ఉంది. కానీ దురదృష్టవశాత్తు మార్కెట్లోనే విద్యుత్ దొరికే పరిస్థితి లేదు' అని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న విద్యుత్‌ను చాలా పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. విద్యుత్ ఆధారితంగా జరిగే అత్యవసరం కాని పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

గతంలో వచ్చిన కోవిడ్ సంక్షోభాన్ని ఏ రకంగా ఎదుర్కొన్నామో, అదే తరహా పకడ్బందీ ప్రణాళికతో ఎల్‌నినో సవాలును కూడా దాటాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చుక్క నీరు కూడా వృథా కాకుండా చూడాలన్నారు. భవిష్యత్తులో నీటి సమస్య జటిలం కాకుండా ముందుజాగ్రత్త పనులు తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు.

ఈ పోరాటంలో ప్రజలను నేరుగా భాగస్వాములను చేయడమే అత్యంత కీలకమని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎల్‌నినో ప్రభావంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సినిమాలు, మీడియా, కళాజాతాలు , ఇతర సామాజిక మాధ్యమాలను ఉపయోగించి నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శనివారం,
10 అక్టోబర్, 2026

వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మెయిల్: mudradaily@gmail.com




# స్టార్‌లింక్‌తో సవాళ్లు

## సార్వభౌమత్వమే ప్రథమం

ఆకాశం నుంచి అందే ఇంటర్నెట్ మారుమూల ప్రాంతాలకు వరమవుతుంది. అదే సాంకేతికతపై నియంత్రణ విదేశీ సంస్థల చేతుల్లో ఉంటే భద్రతాపరమైన ప్రశ్నలూ తలెత్తుతాయి. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవల విషయంలో భారత్ ముందున్న అసలు సవాలు ఇదే. సాంకేతిక పురోగతికి తలుపులు తెరుస్తూనే, దేశ సార్వభౌమత్వానికి భంగం కలగకుండా చూసుకోవడం ప్రభుత్వ బాధ్యత

స్టార్‌లింక్‌కు సంబంధించిన చర్చ ఇటీవల మరో మలుపు తిరిగింది. భారత మార్కెట్లో తన సంస్థకు అడ్డంకులు సృష్టిస్తున్నారంటూ దేశీయ వ్యాపార ప్రయోజనాలపై మస్క్ ఎక్స్ వేదికగా వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో స్టార్‌లింక్ వల్ల కలిగే ప్రమాదాలపై ఆయన సంస్థకు చెందిన ఏఐ సాధనం గ్రోక్ ఇచ్చిన సమాధానాలు చర్చకు వచ్చాయి. అయితే ఏఐ సమాధానాన్ని అంతిమ సాక్ష్యంగా కాకుండా, పరిశీలించాల్సిన అంశాలను గుర్తుచేసే సమాచారంగా చూడాలి. వాదనలకూ, నిర్ధారిత వాస్తవాలకూ మధ్య తేడా గుర్తించడం ముఖ్యం.

భద్రతకు సవాళ్లు యుద్ధం, ఉగ్రవాద కార్యకలాపాలు, అంతర్గత అశాంతి వంటి పరిస్థితుల్లో సమాచార వ్యవస్థలపై ప్రభుత్వానికి చట్టబద్ధమైన నియంత్రణ ఉండాలి. ఉపగ్రహ ఇంటర్నెట్ సంప్రదాయ టెలికాం నెట్‌వర్క్‌లకు భిన్నంగా పనిచేస్తుంది. అందువల్ల అత్యవసర సమయాల్లో సేవల నిలిపివేత, వినియోగదారుల గుర్తింపు, అక్రమ టెర్మినళ్ల నియంత్రణ, భద్రతా సంస్థల దర్యాప్తుకు సహకారం వంటి అంశాలపై స్పష్టమైన నిబంధనలు అవసరం. అనుమతి లేకుండా టెర్మినళ్లు వినియోగంలోకి వస్తే సరిహద్దు ప్రాంతాల్లో వాటి దుర్వినియోగాన్ని అరికట్టడం మరింత క్లిష్టమవుతుంది.

డేటాపై ఎవరి అధికారం? ఉపగ్రహాల మధ్య లేజర్ అనుసంధానాలు, విదేశీ నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలు సమాచార ప్రసార మార్గాలను సంక్లిష్టం చేయవచ్చు. ప్రతి డేటా ప్యాకెట్ తప్పనిసరిగా విదేశాలకు వెళుతుందని చెప్పడం సరికాదు. అయినప్పటికీ భారత చట్టాల ప్రకారం అవసరమైన సమాచారాన్ని పొందడం, చట్టబద్ధమైన నిఘా నిర్వహించడం, వినియోగదారుల గోప్యతను కాపాడటం ఎలా సాధ్యమవుతాయో ప్రభుత్వం ముందుగానే నిర్ధారించాలి. డేటా భద్రత, జాతీయ భద్రత పరస్పర విరుద్ధమైనవి కావు, రెండింటికీ రక్షణ కల్పించాలి.

వ్యాపార పోటీనా, వ్యూహాత్మక ఆధిపత్యమా? జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థలతో స్టార్‌లింక్ పోటీ పడటం సహజం. పోటీ వల్ల సేవల నాణ్యత పెరిగి, ధరలు తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలు, కొండప్రాంతాలు, మారుమూల గ్రామాలు, విపత్తులు సంభవించిన ప్రాంతాల్లో ఉపగ్రహ ఇంటర్నెట్ ఉపయోగపడుతుంది. మరోవైపు, కీలక సమాచార వ్యవస్థ ఒకే విదేశీ సంస్థపై అధికంగా ఆధారపడితే, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు లేదా సేవల నిలిపివేత దేశ ప్రయోజనాలను ప్రభావితం చేయవచ్చు. ఉక్రెయిన్ యుద్ధంలో స్టార్‌లింక్ సేవలపై తలెత్తిన వివాదాలు ఈ అంశం ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తాయి.

కాబట్టి ఇది అంబానీ–మస్క్ వ్యాపార పోటీగా మాత్రమే చూడాల్సిన విషయం కాదు. అదే సమయంలో పోటీదారుల ప్రయోజనాల కోసం విదేశీ సంస్థను అనవసరంగా అడ్డుకుంటున్నారనే ఆరోపణలకూ ఆధారాలు అవసరం. లైసెన్సులు, స్పెక్ట్రమ్ కేటాయింపులు, భద్రతా అనుమతులు పారదర్శకమైన, అందరికీ సమానమైన ప్రమాణాల ప్రకారం జరగాలి.

భారత్‌లో అవసరమైన గేట్‌వేలు, చట్టబద్ధమైన నిఘా ఏర్పాట్లు, టెర్మినళ్ల నమోదు, ప్రభుత్వ అత్యవసర ఆదేశాల అమలు, డేటా రక్షణ, సేవల నిరంతరతకు సంబంధించిన షరతులను స్పష్టంగా నిర్దేశించాలి. వాటి అమలును స్వతంత్రంగా పర్యవేక్షించే వ్యవస్థ కూడా ఉండాలి.

ఇంటర్నెట్ ఆకాశం నుంచి రావచ్చు, కానీ దాని నియంత్రణ భారత చట్టాల పరిధిలోనే ఉండాలి. అభివృద్ధికి ఆహ్వానం పలుకుతూనే భద్రతకు భరోసా కల్పించడం ద్వారానే సాంకేతిక స్వావలంబన సాధ్యమవుతుంది. దేశ ప్రయోజనాల విషయంలో రాజీకి తావుండకూడదు, అదే సమయంలో భద్రత పేరుతో ప్రయోజనకరమైన సాంకేతికతకు తలుపులు మూయకూడదు.

కొలను వెంకటేశ్వర రెడ్డి

# బతకడం వేరు జీవించడం వేరు

బతకడం వేరు. జీవించడం వేరు. జీవితం అంటే తెలిసినవారు, జీవించడం ఎరిగిన మన పూర్వీకులు జీవించారు. బ్రతకడం మాత్రమే తెలిసిన వారు ఈనాడు రోజులు వెళ్ళబోస్తున్నారు.

రేడియో మాత్రమే ఉండి, పెరట్లో మూగ జీవాలు సందడి చేస్తూండగా, చావిడిలో పశుసంపద పిలుస్తూండగా తెల్లారే రోజులు అవి. లేవగానే మనసు ఆహ్లాదంగా, ప్రశాంతంగా ఉంటే రోజంతా అలాగే ఉండేది. తనకోసం తాను బతకడం మాత్రమే గాక, తనచుట్టూ వుండే పశుపక్ష్యాదులను చూసు కుంటూ వాటి అవసరాలు కూడా తీర్చడంలో మునిగిన ఆడ మగవారికి అనవసరమైన విషయాలపై దృష్టి మళ్ళేది కాదు.

జీవన విధానంలో ఆడమగ జీవితాలపై చర్చ ఉండకపోవడం మహా ప్రసాదం. ఒకరికోసం మరొకరు, అంతే. ఎవరి విధులు వారివి, ఎదుటివారికి సహాయం చేసే ఆలోచన ఒక వరం.

మహాలయ పక్షంలో ఆనాటి పెద్దలు యథాప్రకారం వచ్చి, తమ వారసుల బతుకులు చూసి ఆనందిస్తారా లేక జీవించడం మరచి పోయారని దుఖిఃస్తారో తెలీదు. తెలుసుకునే అవకాశం కూడా ఉండదు. వారి కోసం మనం చేయగల ఒకేఒక సత్కార్యం, జీవించడం.

**మన పెద్దలు ఆనందమేగా మనకు కూడా ఆనందం.**

**శుభోదయం.**

# కుడి ఎడమైతే పొరపాటే

కర్బన రసాయన అణువుల్లో అవి 2 ఒకేలా కనిపిస్తాయి. కానీ, ఒకటి ఉపయోగపడితే.. ఇంకొకటి నిరుపయోగంగా మారే అవకాశాలే ఎక్కువ. ఇది మన శరీరంలోనే జరిగే అద్భుతమైన కెమిస్ట్రీ.. మన రెండు చేతులను ఒకసారి గమనిస్తే.. ఎడమ మరియు కుడి చేతులు రెండింట్లో ఐదు వేళ్లే.. ఆకారం కూడా దాదాపు ఒకటే.. కానీ ఎడమ చేతిని అద్దంలో చూస్తే కనిపించే ప్రతిబింబం కుడి చేయిలా ఉంటుంది.. ఇలాంటి బింబ ప్రతిబింబ జతలు కొన్ని రసాయన అణువుల్లో కూడా ఉంటాయి.. వాటినే రసాయన శాస్త్రంలో అసౌష్టవ అణువులు (కైరల్ మాలిక్యూల్స్) అంటారు.. ఆ రెండింటి ఆధ్యారోపితం కాని బింబ ప్రతిబింబ రూపాలను (నాన్ సూపర్ ఇంపాజిబుల్ మిరర్–ఇమేజ్ ఫామ్స్)ను ఎనాన్షియోమర్లు అంటారు. దృశ్య సాదృశ్యాల (ఆప్టికల్ ఐసోమర్స్) మీద సాధారణ పరిశోధన చేసినందుకు మరియు ఒకే రకమైన ప్రతిబింబ అణువు ( మిర్రర్ ఇమేజ్ మాలిక్యూల్) ఎక్కువగా ఎలా తయారవుతుందో, అవసరం లేని అణువును రసాయన చర్యల ద్వారా ఎలా నియంత్రించాలన్న గుట్టువిప్పినందుకుగాను శాస్త్రవేత్తలు హెన్రీ కాగన్, కెన్సో సోయిలు 2026 నోబెల్ పురస్కారం అందుకున్నారు.




ఇక్కడే అసలు ట్విస్ట్. మన శరీరం ఈ రెండు అణువులను ఒకేలా చూడదు.. ఎందుకంటే మన శరీరంలోని ప్రోటీన్లు, ఎంజైములు, డీఎన్ఏ.. ఇలా అన్నింటికి ఒక నిర్దిష్టమైన అణు ఆకృతి (మాలిక్యులర్ షేప్) ఉంటుంది. అందుకే ఒక అణువు మన శరీరంలో సరైన తాళానికి సరిపోయే తాళం చెవిలా పనిచేస్తే.. దాని ప్రతిబింబం మాత్రం సరిగ్గా సరిపోకపోవచ్చు.. ప్రాదేశిక సాదృశ్యాల్లో (జామెట్రికల్ ఐసోమర్స్) కూడా దీనికి కొన్ని ఉదాహరణలు ఉన్నాయి. సీఐఎస్–ప్లాటిన్ మరియు ట్రాన్స్ – ప్లాటిన్ లలో సిస్ – ప్లాటిన్ కేన్సర్ ను నివారించే ఒక ముఖ్యమైన మందుగా పనిచేస్తుంది. కానీ.. సిస్ ప్లాటిన్ లాగే Pt, $NH_3$, $Cl_2$ లతోనే తయారైన ట్రాన్స్– ప్లాటిన్ మాత్రం కేవలం దాని జ్యామితి (జామెట్రీ) మారడం వల్ల డీఎన్ఏతో ఏర్పడే పరస్పర చర్యలు సిస్–ప్లాటిన్ లాగా ఉండవు.. అందుకే సిస్–ప్లాటిన్ తో పోలిస్తే ఇందులో యాంటి కాన్సర్ యాక్టివిటీ చాలా తక్కువగా ఉంటుంది.. దీన్నిబట్టి అణువులకు కూడా మన లాగే ఎడమ మరియు కుడి చేతులుంటాయని అర్థం చేసుకోవచ్చు.. ఇదే వందేళ్లకు పైగా శాస్త్రవేత్తలను వెంటాడిన రసాయన శాస్త్ర రహస్యం – ఏక హస్తాణు ధర్మ రహస్యం (హోమోకైరాలిటీ మిస్టరీ). ఈ రహస్యాన్ని ఛేదించే దిశలో ఈ ఇద్దరు శాస్త్రవేత్తలు అద్భుతమైన పరిశోధన చేశారు.. అందుకే వీరిద్దరికి 2026 కెమిస్ట్రీ నోబెల్ బహుమతి దక్కింది.

ఒక రసాయన చర్యలో రెండు బింబ ప్రతిబింబ రూపాలు ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు.. ఒక రూపాన్ని మరొక దానికంటే ఎక్కువగా తయారు చేయడానికి చర్యను ఎలా నియంత్రించాలో కాగాన్ చూపించారు.. అంటే.. "రెండూ రావచ్చు.. కానీ నాకు కావాల్సింది ఈ ఒక్క రూపమే" అని రసాయన శాస్త్రానికి చెప్పే మార్గాన్ని ఆయన అభివృద్ధి చేశారు.. ఈయన పరిశోధనలో ముఖ్యమైన అంశం అనుపాతంలో లేని ప్రభావం (నాన్–లీనియర్ ఎఫెక్ట్). మొదట చిన్న అణు అసమతుల్యత (మాలిక్యులర్ ఇంబాలెన్స్) ఉంటే.. చర్యలో అది ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా పెరగవచ్చని చూపించారు.

ఇక జపాన్ శాస్త్రవేత్త కెన్సో సోయి ఇంకా ఆశ్చర్యకరమైన విషయాన్ని కనుగొన్నారు. ఒక రసాయన చర్యలో ఏర్పడిన అసౌష్టవ అణువు.. అదే చర్యను మళ్లీ ముందుకు నడిపించడంలో ఉత్ప్రేరకంగా పనిచేస్తే..? అంటే.. తానే తయారై.. తనలాంటి మరిన్ని అణువులు తయారయ్యేలా చర్యను ప్రోత్సహిస్తే? దీనినే స్వయం ఉత్ప్రేరణ చర్య 'ఆటోక్యాటలిసిస్' అంటారు. సోయి చేసిన ప్రసిద్ధ పరిశోధనల్లో ఈ అద్భుతమైన స్వీయ – బలవర్ధక ప్రవర్తన (సెల్ఫ్– యాంప్లిఫైయింగ్ బిహేవియర్) కనిపించింది.. ఒక చిన్న అణు ప్రాధాన్యత, చర్య కొనసాగుతున్న కొద్దీ మరింత పెద్దగా మారుతుంది. దీనిని సోయి చర్యగా రసాయన శాస్త్రంలో గుర్తిస్తారు. అయితే ఈ పరిశోధన మనకు ఎందుకు అంత ముఖ్యమైనది అంటే ఔషధాల తయారీలో అణు ఆకృతి చాలా ముఖ్యమైనది.. ఒక ఔషధాణువు మన శరీరంలోని నిర్దిష్ట ప్రోటీన్ కి సరిగ్గా సరిపోవాలి.. ఆ అణువు యొక్క ప్రతిబింబ రూపం, అదే విధంగా పనిచేస్తుందని అనుకోవడం సరికాదు. అందుకే ఔషధ రసాయన శాస్త్రం (ఫార్మాసిటికల్ కెమిస్ట్రీ) లో మనకు కావాల్సిన ప్రతిబింబ రూపాన్ని ఎక్కువగా ఎలా తయారు చేయాలి అనేది చాలా ముఖ్యం.

కాగన్, సోయి పరిశోధనలు ఈ అసౌష్టవ సేంద్రీయ సంశ్లేషణ (అసిమెట్రిక్ ఆర్గానిక్ సింథసిస్) రంగానికి కొత్త దిశను చూపాయి. ఒక్క మాటలో చెప్పాలంటే.. అణువులకి కూడా ఎడమ, కుడి చేతులు ఉంటాయని తెలుసుకోవడమే కాదు.. రసాయన చర్యలనుపయోగించి మనకు కావాల్సిన చేతినే ఎక్కువగా ఎలా తయారు చేయాలో చూపించినందుకు హెన్రీ కాగన్, కెన్సో సోయిలకు.. రసాయన శాస్త్ర విభాగం 2026 లో నోబెల్ బహుమతి వచ్చింది.. ఇదే విజ్ఞానం యొక్క అందం.. మన కంటికి కనిపించని ఒక చిన్న అణువులోని ఒక చిన్న ప్రతిబింబం.. ప్రపంచంలోని ఔషధాలు, జీవ మరియు రసాయన శాస్త్రాల గురించి మనకున్న అవగాహననే మార్చగలదు అనడంలో ఎలాంటి సందేహం లేదు. హెన్రీ కాగన్, కెన్సో సోయిల కృషికి అభినందనలు.

నాగరాజు మంచిపగడం
సీనియర్ కెమిస్ట్రీ ఫాకల్టీ
శ్రీ ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజ్,
హైదరాబాద్ (9052260100)

# కొండంత ప్రేమల కొమ్మిడి లక్ష్మారెడ్డి

## పులిగిల్ల మహాత్మునికి - నివాళి గీతం

కొండంత ప్రేమల కొమ్మిడి లక్ష్మా రెడ్డి
కడుపేదల గుండెల్లో కొలువైన మా తండ్రి
పోరువై నడిచిన నిక్కచ్చి కామ్రేడ్డు
పులిగిల్లాభివృద్ధికి చేసినవు ప్రాణాలోడ్డి

మానవత్వ బోధనలో ఎదిగిన మహనీయుడవు
మంచికి మరోపేరుగా సేవల రణధీరుడవు
పందొమ్మిది వందల ఎనభై ఒక్కటిలో
పులిగిల్ల పంచాయితీ పగ్గాలు చేపట్టి

గాయాల ఊరిని గాడిలో పెట్టుటకు
గుండె ధైర్యంతో కదిలినావు ముందుకు
దళిత వర్గానికి ధైర్యాన్ని ఇచ్చినవు
కులం మతం లేదంటూ కలిసి భోంచేసినవు

పుష్కర జాతుల ఐక్యతను సాధించి
పుణ్య పులిగిల్లలో వెలిగినావు దివిటివై
యువకులు చెడు మార్గం పట్టొద్దని బోధన
ఊరూరా నినుచూసి చేసింది సాధన



గడీల భూమి కబ్జా కాకుండా చేసి
గుడిసె బడినుండి గుడిలాంటి బడి చేసి
బడిపిల్లల చేతిలో బలపమై నిలిచితివి
నీటి ట్యాంకును కట్టి ప్రజల దాహార్తి తీర్చి

పల్లె దవాఖానకు ఆనాడే ప్రాణం పోసి
ప్రజారోగ్యం పరిశుభ్రతకు వేసినావు పెద్దపీట
పశుశాల నిర్మించి పశువుల కన్నీరు తుడిచి
పరిపాలన దక్షుడై నిలిచెను లక్ష్మా రెడ్డి

కట్టుబాటు పద్ధతిలో ఊరి పట్టు సాధించి
కొట్లాట, గొడవలు ఊరిలోనే పరిష్కరించి
కరువొచ్చినా వరదొచ్చిన నీమనసు మారలేదు
కష్టాలెన్నెదురైనా ఊరి విలువ పెంచిండు

2001 వరకు సర్పంచ్ గా నీ సేవలు
వందరై పులిగిల్లకు నీ ప్రేమల అమృతాలు
శిథిలమైన ఊరిని శిల్పంలా చేసినావు
శిలా ఫలకం మీద రాసుకోలేదు నీ పేరు

ఇరవై ఏళ్లు సర్పంచ్ గా అభివృద్ధి ఫలాలు
ప్రగతి పులిగిల్లకు కనిపించిన ఆనవాలు
నీ ఆశయాల బాటలో కదులుతుంది యువత
నీ దీవెనలు అందించు పులిగిల్ల మహాత్మా

లంచమంటే ఎరుగని రారాజు లక్ష్మా రెడ్డి
అబద్ధం ఆడని హరిశ్చంద్రుడు లక్ష్మా రెడ్డి
నీతికి నిజాయితీకి – నిలువుటద్దం లక్ష్మా రెడ్డి
నిగురుగప్పిన నిప్పులా బతికెను లక్ష్మా రెడ్డి

భువినుండి దివికేగిన కొమ్మిడి లక్ష్మా రెడ్డి
బడిపిల్లలు అడుగుతుంట్రు వచ్చిపో తండ్రి
అక్టోబర్ రెండున – ఆకాశం ఎక్కితివి
పులిగిల్ల తల్లి గుండెలో – శాశ్వతమైతివి

**అమరజీవి కొమ్మిడి లక్ష్మా రెడ్డి గారికి ఘన నివాళి అర్పిస్తూ**

వాకిటి రామ్ రెడ్డి పులిగిల్ల



# ఈ మూడు కలిపి తాగితే బరువు మాయం

ప్రస్తుత కాలంలో రకరకాల ఆహార పదార్థాలను తినాల్సి వస్తుంది. ముఖ్యంగా చాలా మంది ఇంట్లో వండిన ఆహారం కంటే బయట దొరికే స్ట్రీట్ ఫుడ్ ఎక్కువ తీసుకుంటున్నారు. ఇలాంటివారు జీర్ణ సమస్యలను ఎక్కువగా ఎదుర్కోవాల్సి వస్తుంది. అయితే ఈ సమస్యలు రా కుండా ఉండాలంటే.. ఇంట్లో లభించే కొన్ని పదార్థాలతో కషాయం చేసుకొని తాగుతూ ఉండాలి. దీని వల్ల కడుపు క్లీనై సౌకర్యవంతంగా ఉంటుంది. మరి ఇంట్లో దొరికే ఆ కషాయం ఏంటో ఇప్పుడు చూద్దాం..

సాధారణంగా మనం వండే కూరల్లో జీలకర్ర వేస్తుంటాం. ఇది పైకి కనిపించకపోయినా ఇది ఎక్కువ గా ఉపయోగించిన ఆహారం తినడం వల్ల ఆరోగ్యంగా ఉండగలుగుతారు. అయితే ఈ జీలకర్రతో పాటు వాము, సోంపు కలిపి వేడి నీటిలో మరగపెట్టి తాగడం వల్ల జీర్ణక్రియ సమస్యలు లేకుండా పోతాయి. ఉదయాన్నే రకరకాల ఆహార పదార్థాలు తిన్నవారు కడుపులో అసౌకర్యంగా ఉంటే కూడా దీనిని తీసుకోవచ్చు.

కేవలం జీర్ణ సమస్యలు మాత్రమే కా కుండా బరువు నియంత్రణ కోసం కూడా ఈ పానీయాన్ని తీసుకోవచ్చు. ప్రస్తుత కాలంలో చాలా మంది బరువుతో ఇబ్బంది పడుతున్నారు. బరువు తగ్గడానికి అనేక వ్యాయామాలు చేస్తున్నారు. అయితే ఉదయాన్నే ఈ మూడు కలిపిన నీటిని ప్రతిరోజు ఉదయం కొన్ని రోజులపాటు తాగడం వల్ల కడు పులో ఉండే కొవ్వు దాదాపు కరిగిపోయే అవకాశాలున్నాయని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.

ఇవే కాకుండా షుగర్ అదుపులో ఉండడానికి కూడా ఈ కషాయం తాగితే సరైన ఫలితాలు ఉంటా యనిచెబుతున్నారు. అయితే వీరు వైద్యుల సలహా మేరకు మాత్రమే తీసుకోవాలి. అంతేకాకుండా ఎక్కువగా ఉష్ణోగ్రత కలిగిన వారు సైతం వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే మసాలా దినుసుల్లో భాగమే జీలకర్ర ను ఉపయోగిస్తారు. అందువల్ల ఈ కషా యం తాగడం వల్ల ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉంటుంది.

అంతేకాకుండా ప్రతిరోజు ఉదయం దీనిని తీసుకోవడం వల్ల రోజంతా ఎలాంటి ఆహారం తీసుకున్న కూడా జీర్ణక్రియ సక్రమంగా ఉండే అవకాశం ఉంటుంది. వీటితోపాటు వ్యాయామం చేయడం వల్ల తొందర్లోనే బరువు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 11.10.2026
www.mudranews.in | @mudranews



## దానిమ్మ కషాయం తయారీలో జాగ్రత్తలు

సాంప్రదాయ పద్ధతుల్లో దానిమ్మ ఆకులను నీటిలో మరిగించి కషాయం తయారుచేస్తారు. అయితే దీనిని ఎంత మోతాదులో, ఎప్పుడు తీసుకోవాలనే దానిపై నిరూపితమైన మార్గదర్శకాలు లేవు. ఆకులపై దుమ్ము, పురుగు మందుల అవశేషాలు లేకుండా చూసుకోవాలి.




# విదేశాలకు తెలంగాణ సన్న బియ్యం ఎగుమతులు

**అంతర్జాతీయ మార్కెట్‌లో తెలంగాణ బియ్యానికి గుర్తింపు తీసుకొస్తాం**

**ముద్ర, ఫిలిప్పీన్స్:** తెలంగాణ రాష్ట్రం దేశానికే కాకుండా విదేశాలకు సైతం నాణ్యమైన సన్న బియ్యాన్ని ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో తెలంగాణ బియ్యానికి మరింత గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఆసియా, ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాలతో దీర్ఘకాలిక ఎగుమతి ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది.ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరుగుతున్న అంతర్జాతీయ వరి సదస్సు (ఐడబ్ల్యూఆర్‌సీ)–2026లో తెలంగాణ పౌరసరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్–అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం. స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్ రాష్ట్ర వ్యవసాయ రంగ ప్రగతిని వివరించారు. అంతర్జాతీయ బియ్యం కొనుగోలుదారులు, వ్యాపార సంస్థలు తెలంగాణతో నేరుగా భాగస్వామ్యం కావాలని ఆయన ఆహ్వానించారు.గత సీజన్‌లో తెలంగాణ 1.85 కోట్ల టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేసిందని, దేశ మొత్తం బియ్యం ఉత్పత్తిలో రాష్ట్ర వాటా సుమారు 12 శాతంగా ఉందని తెలిపారు. దేశంలో బియ్యం సాగు



విస్తీర్ణంలో తెలంగాణ వాటా 10 శాతమే ఉన్నప్పటికీ గణనీయమైన ఉత్పత్తి సాధించడం విశేషమన్నారు.ఇప్పటివరకు మిగులు బియ్యం నిర్వహణపై దృష్టి సారించిన పౌరసరఫరాల శాఖ, ప్రస్తుతం తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్‌లో అధిక విలువ కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. విదేశీ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన సన్న, సూపర్‌ఫైన్ రకాల బియ్యం ఉత్పత్తి, ఎగుమతులను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.2025లో ఫిలిప్పీన్స్‌కు 30 వేల టన్నుల బియ్యాన్ని విజయవంతంగా ఎగుమతి చేసిన తెలంగాణ, ఇప్పుడు మరిన్ని దేశాలకు ఎగుమతులను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. నాణ్యమైన బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు అంతర్జాతీయ వ్యాపార సంస్థలు, రిటైలర్లు, ఆహార ఉత్పత్తి కంపెనీలు, ఎగుమతిదారులు ముందుకు రావాలని ఆహ్వానించింది.అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యత, పారదర్శకత, సరఫరా సామర్థ్యాన్ని పెంపొందిస్తూ తెలంగాణను విశ్వసనీయ బియ్యం ఎగుమతిదారుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. బియ్యం ఉత్పత్తి మూలాలను గుర్తించే వీలుతో పాటు, కొనుగోలుదారుల అవసరాలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.రాష్ట్ర ప్రజల ఆహార భద్రతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటూనే, మిగులు బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్‌లో మెరుగైన ధర, విలువ తీసుకురావడం ద్వారా తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## ఫలక్‌నుమా ఖాళీ మాతా ఆలయంలో
# భక్తులకు కనీస వసతులు కల్పించాలి

**రోడ్డు, మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి**
**ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం**
**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

**ముద్ర, ఫలక్‌నుమా:** ఫలక్‌నుమాలోని ఖాళీ మాతా ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారని, వారికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆలయానికి వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడం, మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యాలు సరిగా లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆమె మాట్లాడారు.ఖాళీ మాతా ఆలయంపై హైదరాబాద్ ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని, అమ్మవారు భక్తుల కొంగుబంగారంగా నిలుస్తున్నారని కవిత అన్నారు. అమ్మవారికి ముడుపు కడితే కోరిన కోరికలు నెరవేరుతాయనే విశ్వాసంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వస్తుంటారని తెలిపారు. అమావాస్య రోజుల్లో భక్తుల రద్దీ మరింత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. పెత్తరమాసం, బతుకమ్మ పండుగ ప్రారంభం సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలిఆలయం చుట్టూ రైల్వే భూములు ఉండటంతో పాటు పక్కనే శ్మశానం ఉండటంవల్ల రహదారి నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని కవిత పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే రైల్వే శాఖ




నుంచి అవసరమైన భూమిని పొందేందుకు కృషి చేయాలని సూచించారు. దేవాదాయ శాఖ, రైల్వే శాఖల మధ్య సమన్వయం సాధించి ఆలయానికి రహదారి ఏర్పాటు చేసే అంశంపై సంబంధిత అధికారులతో మాట్లాడతామని తెలిపారు. భక్తులకు అవసరమైన కనీస వసతులు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు.సోషల్ మీడియా ద్వారా సమస్య వెలుగులోకిఖాళీ మాతా ఆలయంలో భక్తులకు సౌకర్యాలు లేవన్న విషయాన్ని సాయి అనే యువకుడు సోషల్ మీడియా ద్వారా తమ దృష్టికి తీసుకొచ్చారని కవిత తెలిపారు. సోషల్ మీడియాను కొందరు ప్రతికూలంగా ఉపయోగిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో, సాయి, ఆయన బృందం ప్రజా సమస్యను గుర్తించి తమ దృష్టికి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఇలాంటి సామాజిక బాధ్యతతో కూడిన ప్రయత్నాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆమె పేర్కొన్నారు.

# సి.ఆర్. ఫౌండేషన్‌లో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**135 మందికి ఉచిత వైద్య సేవలు**

**ముద్ర, కొండాపూర్:** కొండాపూర్‌లోని సి.ఆర్. ఫౌండేషన్‌లో అక్టోబర్ 10న నిర్వహించిన ఉచిత బహుళ వైద్య శిబిరం విజయవంతమైంది. సి.ఆర్. పాలీ క్లినిక్, రోటరీ ప్రొలిఫిక్స్ డయాగ్నస్టిక్ సెంటర్, ఐడిపీడీ తెలంగాణ, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సమీప, దూర ప్రాంతాల నుంచి వచ్చిన 135 మంది రోగులకు వైద్య సేవలు అందించారు.వివిధ విభాగాల్లో వైద్య సేవలుశిబిరంలో హృదయ సంబంధిత వ్యాధులకు కార్డియాలజిస్టుల బృందం సేవలందించగా, ఫ్యామిలీ ఫిజీషియన్‌గా సి.ఆర్. పాలీ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె. రజని, జనరల్ ఫిజీషియన్లుగా డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ సి. పవన్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. గైనకాలజీ విభాగంలో డాక్టర్ సి. అరుణ, ఎముకలు, కీళ్ల వైద్య సేవల్లో ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నిపుణులు పాల్గొన్నారు.దంత వైద్య విభాగంలో డాక్టర్ జి. అజయ్, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ తహ్మినా సేవ



లందించారు. ఆక్యుపంక్చర్ చికిత్సలో రమణ రెడ్డి, రాధికా రెడ్డి, ఫిజియోథెరపీలో డాక్టర్ శ్రీ తేజ సేవలు అందించారు. జేవీఎస్‌పీఎస్ ప్రభుత్వ హోమియోపతి కళాశాల వైద్యుల బృందం, డాక్టర్ గోపాలకృష్ణ హోమియోపతి వైద్య సేవలు అందించగా, ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించింది.రాయితీ ధరలతో పరీక్షలు రోగులకు ఉచితంగా ఈసీజీ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. పాథాలజీ పరీక్షలను తక్కువ ధరలకు, అదనపు రాయితీలతో అందుబాటులోకి తీసుకొచ్చారు.వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలుశిబిరం విజయవంతానికి సహకరించిన వైద్యులకు సి.ఆర్. పాలీ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె. రజని, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్ అధ్యక్షుడు అజయ్ కుమార్ కె. కృతజ్ఞతలు తెలిపారు. సి.ఆర్. పాలీ క్లినిక్ సీఈఓ డి. శ్రీనివాసరావు, సీఓఓ కె. విజయలక్ష్మి వైద్యులు, సిబ్బంది, స్వచ్ఛంద కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు.ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరంప్రతి నెల రెండో శనివారం సి.ఆర్. ఫౌండేషన్‌లో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ కె. రజని సూచించారు.

# 3,730 రైల్వే యూనిట్లలో స్వచ్ఛతా కార్యక్రమాలు

**దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 21,458 మంది భాగస్వామ్యం**

**ముద్ర, హైదరాబాద్:** 'స్వచ్ఛతా హీ సేవా' ప్రచారంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని 3,730 రైల్వే యూనిట్లలో పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. 2026 సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో రైల్వే స్టేషన్లు, రైళ్లు, కార్యాలయాలు, రైల్వే కాలనీలు, ఆరోగ్య కేంద్రాలు, వర్క్‌షాపులు, ఇతర రైల్వే ప్రాంగణాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టారు. జోన్ వ్యాప్తంగా మొత్తం 21,458 మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.లక్ష్యానికి మించి పారిశుద్ధ్య కార్యక్రమాలు'స్వచ్ఛత మే సహభాగ్.. స్వచ్ఛ భారత్, వికసిత భారత్' ఇతివృత్తంతో భారతీయ రైల్వే చేపట్టిన ఈ ప్రచారంలో భాగంగా రైల్వే బోర్డు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తూ దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లతో పాటు వివిధ వర్క్‌షాపుల్లో 3,730 పారిశుద్ధ్య లక్ష్య యూనిట్లను గుర్తించి పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 20 ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.813 మంది కాంట్రాక్టు కార్మికులకు వైద్య పరీక్షలుపారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమిచ్చారు. దక్షిణ మధ్య రైల్వే




పరిధిలో నిర్వహించిన 'మిత్ర సురక్షా' ఆరోగ్య శిబిరాల ద్వారా 813 మంది కాంట్రాక్టు సిబ్బంది ప్రయోజనం పొందారు. ఈ శిబిరాల్లో సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్త పరీక్షలు, రక్తపోటు, రక్తహీనత పరీక్షలు, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. లాలాగూడలోని కేంద్ర ఆసుపత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా చేపట్టారు.ప్రచారంలో భాగంగా బహిరంగ ప్రదేశాల పరిశుభ్రత, స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాలు, పారిశుద్ధ్య కార్మికుల భద్రత, సేవలు, గౌరవానికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంతో పాటు రైల్వే స్టేషన్లు, రైళ్లు, పర్యాటక, చారిత్రక ప్రాధాన్యమున్న ప్రాంతాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.అక్టోబర్ 15 వరకు స్వచ్ఛత పక్షోత్సవం ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అక్టోబర్ 1 నుంచి 15 వరకు స్వచ్ఛత పక్షోత్సవం నిర్వహిస్తున్నారు. రైల్వే ప్రాంగణాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడంతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నారు. 'ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్', 'ఏక్ పేడ్ మా కే నామ్', ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఫ్లాష్‌మాబ్‌లు, వీధి నాటకాల ద్వారా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు.వర్క్‌షాపులు, రైల్వే కాలనీలు, డిపోలు, గూడ్స్ షెడ్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రైల్వే ట్రాక్‌లపై పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్నారు.రైల్వే బృందానికి జనరల్ మేనేజర్ అభినందనలుస్వచ్ఛతా హీ సేవా ప్రచారాన్ని విజయవంతంగా నిర్వహించి, రైల్వే బోర్డు నిర్దేశించి న లక్ష్యాలను అధిగమించిన దక్షిణ మధ్య రైల్వే అధికారులను, సిబ్బందిని జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అభినందించారు. ప్రస్తుతం కొనసాగుతున్న స్వచ్ఛత పక్షోత్సవంతో పాటు త్వరలో నిర్వహించనున్న ప్రత్యేక ప్రచారం 6.0లోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని అధికారులకు, పర్యవేక్షకులకు పిలుపునిచ్చారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో నేటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**ముద్ర, కూకట్‌పల్లి :** శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 11వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణలు ఉంటున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా, ప్రతిరోజూ మహిళలచే లలితా సహస్రనామ పారాయణాలు, కుంకుమార్చనలు మరియు వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ పవిత్ర శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి దివ్యరూపాన్ని కనులారా సేవించి, ఆ శ్రీదేవి కృపకు పాత్రులు కావాలని అర్చకులు విజ్ఞప్తి చేశారు.



## యు జీ డి పనులకు శంకుస్థాపన

**ఆరెకపూడి గాంధీ**

**ముద్ర, కూకట్పల్లి / శేరిలింగంపల్లి :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని జయనగర్ కాలనీలో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు గౌరవ పిఎసి చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మరియు జల మండలి అధికారులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పిఎసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ... భూగర్భ డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. ప్రజల విజ్ఞప్తుల మేరకు అత్యవసర పరిస్థితులు ఉన్న ప్రాంతాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పించి, సమస్యారహిత ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.డ్రైనేజీ సమస్యతో పాటు, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు ప్రత్యేక పైప్‌లైన్ పనులు కూడా వేగవంతం చేస్తున్నామని చెప్పారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎమ్ శ్రీనివాస రాజు, మేనేజర్ అనిల్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఆర్టీసీ ఎన్నికల్లో ఎన్‌ఎమ్‌యూ గెలుపు

**ముద్ర, కుత్బుల్లాపూర్ :** రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఆర్టీసీ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అనుబంధ సంఘం ఏఐటీయూసీ (AITUC) బలపరిచిన ఎంప్లాయిస్ యూనియన్ 6,000 పైచిలుకు ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించడం ఎర్రజెండాపై కార్మికులకు ఉన్న నమ్మకానికి ప్రతీక అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పేర్కొన్నారు. జీడిమెట్ల ఆర్టీసీ డిపోలో శనివారం నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.మేడ్చల్ జిల్లా పరిధిలోని జీడిమెట్ల, కూకట్‌పల్లి, ఉప్పల్, చెంగిచెర్ల, కుషాయిగూడ డిపోలలో ఎంప్లాయిస్ యూనియన్ 'బస్సు' గుర్తు అత్యధిక మెజార్టీతో విజయం సాధించిందని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంతటి ప్రలోభాలకు గురిచేసినప్పటికీ, కార్మికులు నీతి, నిజాయితీ వైపే నిలబడ్డారని అన్నారు. అధికారం, డబ్బు, అహంకారానికి వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటంలో ఎంప్లాయిస్ యూనియన్ ద్వారానే ఆర్టీసీకి రక్షణ ఉంటుందని నమ్మి కార్మికులు ఈ చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని హర్షం వ్యక్తం చేశారు.ఈ విజయం ఇచ్చిన స్ఫూర్తితో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో సీపీఐ బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిగా విలీనం చేసేంత వరకు ఎంప్లాయిస్ యూనియన్, జేఏసీ (JAC) చేపడుతున్న అన్ని పోరాటాలకు సీపీఐ పూర్తి మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు.జీడిమెట్ల డిపో యూనియన్ కార్యదర్శి డేనియల్, అధ్యక్షుడు పాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, రాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు నరసింహారెడ్డి, బాబు, మహేందర్, బి.ఎల్. నారాయణ, బాలయ్య, రాజేష్, ఖయ్యూమ్, భాస్కర్, శేఖర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీక బతుకమ్మ

**తెలంగాణ ఆడబిడ్డలందరికీ ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు**
**పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



**ముద్ర, శేరిలింగంపల్లి:** తెలంగాణ ఆడపడుచుల ఔన్నత్యానికి, ఆచార సంప్రదాయాలకు, సంస్కృతికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆడపడుచులతో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గ మహిళలందరికీ ఎంగిలిపూల బతుకమ్మ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు మాజీ చైర్‌పర్సన్ రాగం సుజాత యాదవ్ జయంతిని పురస్కరించుకుని రాగం సుజాత నాగేందర్ యాదవ్ ఫౌండేషన్, శేరిలింగంపల్లి మండల గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం సంయుక్తంగా మెగా బతుకమ్మ సంబరాలను నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆరెకపూడి గాంధీ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే, మాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ త్రిపురనేని వెంకటరత్నం, మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, జగదీశ్వర్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ బతుకమ్మ బతుకునిచ్చే పండుగ అని, ఆడపడుచుల అపురూప వేడుక అన్నారు. ప్రపంచంలో పూలతో దేవుడిని పూజించడం సాధారణమైతే, తెలంగాణలో పూలనే దేవతగా భావించి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలతో బతుకమ్మను పేర్చి సామూహికంగా సంబరాలు జరుపుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని చెప్పారు. పీజేఆర్ స్టేడియంలో వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని, కార్యక్రమ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 11.10.2026
www.mudranews.in | @mudranews



**దానిమ్మ ఆకుల కషాయం ఈ ఆరు జాగ్రత్తలు మర్చిపోవద్దు!**

రక్తపోటు, మధుమేహం మందులు వాడేవారు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు దానిమ్మ ఆకుల కషాయాన్ని క్రమం తప్పకుండా తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. నిద్రలేమి దీర్ఘకాలం కొనసాగితే వైద్య సలహా తీసుకోవాలి. వైద్యులు సూచించిన మందులకు బదులుగా ఈ కషాయాన్ని ఉపయోగించ కూడదు.



## ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా



**ముద్ర, కరీంనగర్** : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) కరీంనగర్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా వద్ద నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఓట్ల తొలగింపునకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'సర్ ' ప్రక్రియను నిలిపివేయాలన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఈ ఉద్యమం ఆగబోదని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా యువత జంతర్ మంతర్ వద్ద ధర్నాకు పిలుపునిస్తే, కేంద్ర ప్రభుత్వం రైళ్లు, బస్సులను వివిధ ప్రాంతాల్లో నిలిపివేసి యువతను అడ్డుకునే ప్రయత్నం చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

### హైదరాబాద్ టోలిచౌకి పరిధిలో దారుణం..

## బాలిక కిడ్నాప్, విక్రయం..

**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని టోలిచౌకి పోలీసు స్టేషన్ పరిధిలో దిగ్భ్రాంతికర సంఘటన వెలుగుచూసింది. ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, నిర్బంధించి, చివరకు వ్యభిచార గృహానికి విక్రయించిన అమానుష ఘటన నగరంలో కలకలం రేపింది. సెప్టెంబర్ 2న ప్రధాన నిందితుడైన షేక్ అతీఫ్ అనే యువకుడు సదరు బాలికను ఆటోలో టోలిచౌకి నుంచి అత్తాపూర్ ప్రాంతానికి అపహరించుకుపోయాడు. అనంతరం ఆమెను లైంగికంగా వేధింపులకు గురిచేయడమే కాకుండా, అత్తాపూర్ లో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న సబియా బేగం అనే మహిళకు కేవలం రూ. 30,000 కు విక్రయించాడు. అక్కడితో ఆగకుండా.. నిందితులు నెల రోజులకు పైగా ఆ బాలికను బలవంతంగా వ్యభిచార కూపంలోకి నెట్టి క్రూరంగా లైంగిక దోపిడీకి పాల్పడ్డారు. ఎన్నో ఆంక్షలు, తీవ్ర నిర్బంధం మధ్య నరకం అనుభవించిన బాధితురాలు, అక్టోబర్ 5న ఎంతో ధైర్యంతో నిందితుల చెర నుంచి తప్పించుకో గలిగింది. నేరుగా తన తల్లిదండ్రుల వద్దకు చేరుకుని జరిగిన దారుణాన్ని వివరించడం తో, వారు వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టి, ప్రధాన నిందితులు షేక్ అతీఫ్, సబియా బేగంతో పాటు ఈ క్రూరత్వంలో భాగస్వాములైన మొత్తం ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మహిళలు, మైనర్ పిల్లల రక్షణపై ఆందోళన రేకెత్తించిన ఈ ఘోర ఘటనపై పోలీసులు కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి సమగ్ర విచారణ జరుపుతున్నారు.

## ఫారం-7 దరఖాస్తులపై ఈసీఐ కీలక నిర్ణయం

**ముద్ర, న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలకు తావులేకుండా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక చర్యలు చేపట్టింది. ఓటర్ల పేర్ల తొలగింపునకు ఉపయోగించే ఫారం–7 దరఖాస్తుల సమర్పణపై పరిమితులు విధించింది. ఒక వ్యక్తి గరిష్టంగా 10 దరఖాస్తులు మాత్రమే సమర్పించేలా నిబంధనలు తీసుకొచ్చింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు ఫారం–7ను దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణలోని ముషీరాబాద్, బహదూర్ పురతో పాటు కర్ణాటకలోని బళ్లారి తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఫారం–7 దరఖాస్తులు సమర్పించడంపై వివాదాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకతను పెంచేందుకు ఈసీఐ నిబంధనలను కఠినతరం చేసింది. రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు ప్రత్యేక సవరణ సమయంలో డ్రాఫ్ట్ జాబితా ప్రచురణకు ముందు రోజుకు 50, ఆ తర్వాత రోజుకు 10 దరఖాస్తులు మాత్రమే సమర్పించేందుకు అనుమతించింది. సరైన ఆధారాలు లేని, గడువు దాటిన దరఖాస్తులను తిరస్కరించాలని ఎన్నికల అధికారులకు సూచించింది. ఓటరు పేరును తొలగించే ముందు సంబంధిత వ్యక్తికి నోటీసు జారీ చేసి, విచారణ నిర్వహించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. తప్పుడు పత్రాలతో దరఖాస్తులు సమర్పించే వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

## ట్రంప్ కపటనీతి

**ముద్ర, న్యూఢిల్లీ:** రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధిస్తామని హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా తన వైఖరిని మార్చుకున్నారు. రష్యా డీజిల్ పై ఆంక్షలను 2027 ఏప్రిల్ వరకు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించడంతోపాటు, ఆ దేశం నుంచి డీజిల్ కొనుగోలుకు సిద్ధమయ్యారు. దీంతో రష్యాతో వాణిజ్యం విషయంలో ట్రంప్ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధానికి రష్యా నిధులు సమకూర్చుకుంటోందంటూ ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా ఒత్తిడి తెచ్చింది. భారత్ పైనా 25 శాతం అదనపు సుంకాలు విధించింది. రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని కల్పిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేసింది.

**జాతీయ ప్రయోజనాలే ముఖ్యం**

అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో భారత్ తన ఇంధన దిగుమతుల వ్యూహాన్ని అనుసరిస్తోంది. రష్యా సహా పలు దేశాల నుంచి చౌకగా చమురు లభించే చోట కొనుగోలు చేస్తామని స్పష్టం చేసింది. భారత్ చమురు కొనుగోళ్లను విమర్శించే పాశ్చాత్య దేశాలే రష్యాతో వాణిజ్యం చేస్తున్నాయని విదేశాంగ మంత్రి జైశంకర్ గతంలో వ్యాఖ్యానించారు.

**అమెరికాలో ధరల సెగ**

ఇరాన్ తో యుద్ధం, చమురు నౌకలపై దాడులతో అంతర్జాతీయంగా ఇంధన సరఫరాకు అంతరాయాలు ఏర్పడ్డాయి. అమెరికాలోనూ డీజిల్ ధర గ్యాలన్ కు 6 డాలర్లు దాటడంతో రైతులు, ట్రక్కు యజమానులు సహా ప్రజలపై భారం పెరిగింది. ఈ నేపథ్యంలో దేశీయ విమర్శలను తగ్గించుకునేందుకే ట్రంప్ రష్యా డీజిల్ పై ఆంక్షలను సడలించారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇతర దేశాలను హెచ్చరిస్తూ, తన అవసరాలకు మాత్రం రష్యాతో ఒప్పందం చేసుకోవడం ట్రంప్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్టేడియం..

**- తెలంగాణను క్రీడా హబ్‌గా మారుస్తాం..**
**- క్రీడల ప్రోత్సాహానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం..**
**- ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి..**
**- కొరియా తరహాలో క్రీడాకారులను తీర్చిదిద్దే దిశగా అడుగులు..**
**- ఐజీపీఎల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మౌలిక సదుపాయాల కల్పనతోపాటు, యువ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, ప్రోత్సాహకాలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియాన్ని నిర్మించనున్నట్లు సీఎం ప్రకటించారని గుర్తుచేశారు.

హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, ఎన్‌డీటీవీ, ఏఎం గ్రీన్, ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ (ఐజీపీఎల్) సంయుక్త ఆధ్వర్యంలో గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్స్‌లో నిర్వహించిన ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆర్ అండ్ బి మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీని తెలంగాణకు ముఖ్యమంత్రి ఆహ్వానించారని తెలిపారు. మెస్సీ ఫుట్‌బాల్ ఆడటంతో పాటు, హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ప్రకటన కూడా వెలువడిందని పేర్కొన్నారు. క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రాన్ని క్రీడా రంగంలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

ఇటీవల ముఖ్యమంత్రి రాష్ట్రంలో క్రీడలు, ఇతర సంబంధిత కార్యకలాపాల పురోగతిపై సమీక్ష నిర్వహించారని చెప్పారు. దక్షిణ కొరియా వంటి దేశాల్లోని విశ్వవిద్యాలయాలు క్రీడల్లో వందలాది పతకాలు సాధిస్తున్న తీరును పరిశీలించాలని ఈ సందర్భంగా సూచించారని తెలిపారు. ఒకే విశ్వవిద్యాలయం వంద పతకాలు సాధించడం వెనుక ఉన్న శిక్షణా విధానాలు, క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ప్రోత్సాహకాలను అధ్యయనం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి స్వయంగా దక్షిణ కొరియాలోని సంబంధిత విశ్వవిద్యాలయాన్ని సందర్శించి, వైస్ ఛాన్సలర్‌తోపాటు క్రీడా అధికారులతో చర్చలు జరిపారని వెల్లడించారు. తెలంగాణ విద్యార్థులకు క్రీడా శిక్షణ అందించేందుకు ఆ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకోవాలని కోరినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి శిక్షణా విధానాలను అధ్యయనం చేసి, వాటిని రాష్ట్రంలో అమలు చేయాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

గోల్ఫ్ క్రీడ దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతోందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, గోల్కొండ కోట వంటి చారిత్రక ప్రాంతానికి సమీపంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ నగరానికి మరింత ప్రాచుర్యం తీసుకువస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కొనసాగుతున్న గోల్ఫ్ కోర్స్‌ను క్రీడలు, పర్యాటక రంగాల అభివృద్ధికి ఉపయోగపడే ముఖ్యమైన ప్రాజెక్టుగా అభివర్ణించారు. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు పర్యాటక రంగానికి కూడా ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర క్రీడా వేదికలకు అవసరమైన సహకారాన్ని భవిష్యత్తులోనూ అందిస్తామని భరోసా ఇచ్చారు.

**విజేతలకు అభినందనలు**

ఐజీపీఎల్ టోర్నమెంట్‌లో పతకాలు, విజయాలు సాధించిన క్రీడాకారులను భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించి, తమ ప్రతిభతో దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఎన్‌డీటీవీ ప్రతినిధులు, తన మిత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఫహీమ్ ఖురేషి, భాస్కర్ రెడ్డి, ప్రత్యేకంగా ఆహ్వానించారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు రావడానికి ఐదు నుంచి ఐదున్నర గంటల సమయం పడుతుందని, అయినప్పటికీ ఈ కార్యక్రమ ప్రాధాన్యాన్ని గుర్తించి తన ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకుని వచ్చానని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అందజేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

**- చంద్రబాబు**



**ముద్ర, అమరావతి:** స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులదేనని స్పష్టంచేశారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసిన తరువాత సహచర మంత్రులతో సీఎం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి చేసి, రెగ్యులర్ పాలనలోకి వెళ్లాలన్నారు. స్థానిక ఎన్నికల్లో 100శాతం గెలవాల్సిందేనని చెప్పారు. మంత్రులు మరింత చురుగ్గా ఉండటంతో పాటు, కూటమి అభ్యర్థుల విజయానికి ఏ విధంగా ముందుకెళ్లాలన్న దానిపై దిశానిర్దేశం చేశారు.

## వియత్నాంకు 40 మంది ఉపాధ్యాయులు, అధికారుల బృందం..

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు, అభ్యసన ఫలితాలు మెరుగుపరచడమే లక్ష్యంగా అంతర్జాతీయ అధ్యయన పర్యటనలను నిర్వహిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి 2025 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ పర్యటనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గతంలో ఫిన్‌లాండ్ (ఏప్రిల్ 2026), జపాన్ (సెప్టెంబర్ 2026), సింగపూర్ (సెప్టెంబర్ 2026లో రెండు విడతలు) దేశాలకు విజయవంతంగా అధ్యయన బృందాలను పంపిన ప్రభుత్వం, ఇప్పుడు తాజాగా 5వ విడతగా విద్యాశాఖలోని 40 మంది ఉపాధ్యాయులు, అధికారులతో కూడిన బృందాన్ని వియత్నాంకు పంపుతోంది.

హనోయిలోని "వియత్నాం ఎడ్యుకేషన్ స్ట్రాటజీ అండ్ పాలసీ ఇన్‌స్టిట్యూట్" (VESPI) సహకారంతో ఈ 5 రోజుల పర్యటన 2026 అక్టోబర్ 11 నుంచి 17 వరకు (ప్రయాణ సమయంతో కలిపి) కొనసాగనుంది. జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) బి. వెంకటనరసమ్మ నేతృత్వంలో వెళ్తున్న ఈ బృందంలో జిల్లా కలెక్టర్ల కమిటీలు ఎంపిక చేసిన ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, హెడ్ మాస్టర్లు, ఎంఈఓలు, డీఈఓలు మరియు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు భాగస్వాములుగా ఉన్నారు.

ఈ అధ్యయన పర్యటనలో భాగంగా వియత్నాం విజయం వెనుక



ఉన్న విద్యార్థి–కేంద్రక బోధనా పద్ధతులు, సమ్మిళిత విద్య, పాఠ్యప్రణాళిక అమలు, మూల్యాంకన విధానాలు, ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి, PISA పరీక్షల్లో అత్యుత్తమ పనితీరు , బోధనలో సమాచార సాంకేతిక పరిజ్ఞానం (ICT) వినియోగం వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేయనున్నారు. పర్యటన సమయంలో ప్రతినిధుల బృందం స్థానిక పాఠశాలలను సందర్శించడంతో పాటు ప్రముఖ విద్యావేత్తలతో వర్క్‌షాప్‌లు, తరగతి గది బోధనా పద్ధతుల పరిశీలన , ఇంటరాక్టివ్ సెషన్లలో చురుగ్గా పాల్గొంటారు.

# ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ





**తెలంగాణ మహిళలకు పండుగ శుభాకాంక్షలు**

### తెలిపిన జానకి శుక్లా, కావ్య కిషన్ రెడ్డి

**ముద్ర, హైదరాబాద్:** ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ ప్రథమ మహిళ శ్రీమతి జానకి శుక్లా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సతీమణి శ్రీమతి కావ్య కిషన్ రెడ్డి పాల్గొన్నారు. అలై బలై ఫౌండేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో 2026 అక్టోబర్ 10న ఈ వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ, బీజేపీ నాయకుడు ఆలేటి మహేశ్వర్ రెడ్డి సతీమణి శ్రీమతి ఆలేటి కవితా రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలతో పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.





సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

ఆదివారం 11.10.2026

www.mudranews.in | @mudranews



## రక్తపోటు, కొలెస్ట్రాల్‌పై ప్రభావం!



దానిమ్మ పండు రసం, కొన్ని దానిమ్మ ఉత్పత్తులపై జరిగిన పరిశోధనల్లో రక్తపోటు విషయంలో కొన్ని సానుకూల సూచనలు కనిపించాయి. అయితే ఈ ప్రయోజనాలు దానిమ్మ ఆకుల కషాయంతోనూ లభిస్తాయని చెప్పలేం.

## శోభాయమానంగా వసంతోత్సవం



స్వర్ణగిరి దివ్యక్షేత్రంలో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతాలు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా అర్చక స్వాములు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు.శనివారం సకల దోష నివారణార్థం అమావాస్యని పురస్కరించుకొని స్వర్ణగిరి క్షేత్రంలో శ్రీ సుదర్శన నారసింహ హవనం చేశారు. శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు.

- ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

# ఆర్టీసీలో ఏఐటీయూసీ విజయభేరి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రస్థాయి గుర్తింపు సంఘంగా విజయం సాధించడం ఆర్టీసీ కార్మికుల విజయమని, ఎర్రజెండాపై వారికి ఉన్న విశ్వాసానికి ఇది నిదర్శనమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) విజయం సాధించిన సందర్భంగా శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని వినాయక చౌరస్తా (డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం) వద్ద ఏఐటీయూసీ



నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్‌పై విశ్వాసం ఉంచి విజయాన్ని అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, నాయకులు రెహమాన్, పేరబోయిన మహేందర్, సామల శోభన్ బాబు, ఉప్పల శాంతి కుమార్, కందుల మధు, ఎండి నయీమ్, మారుపాక వెంకటేష్, చింటూ, జాను, రమేష్, సాయి, శ్రీకాంత్, గౌతమ్, ఆకాష్ పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలే కాంగ్రెస్ విజయానికి బలం

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించాలి**
**డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి పిలుపు**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 10 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీ విజయానికి ముఖ్యమైన బలం అని, ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని సూచించారు. ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం



సాధించేందుకు పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. అసెంబ్లీ, మండల, గ్రామ స్థాయిల్లో వరుస సమావేశాలు ఏర్పాటు చేసి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రతి శాసనసభ నియోజకవర్గానికి సీనియర్ నాయకుడిని ఇన్‌ఛార్జిగా నియమించి సమన్వయంతో పనిచేయాలని కోరారు. గతంలో ఓటరుగా నమోదైన వారు కూడా ఈ ఎన్నికల ప్రక్రియకు అనుగుణంగా మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ముందుగా కాంగ్రెస్ కుటుంబాల్లోని పట్టభద్రులను, ఆ తర్వాత తటస్థ ఓటర్లను, ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల సానుకూలంగా ఉన్న పట్టభద్రులను కలిసి పార్టీ అభ్యర్థికి మద్దతు కూడగట్టాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలను ఇంటింటికీ వివరించాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని తటినీ కరపత్రాల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.కాంగ్రెస్ సిద్ధాంతాలకు అంకితమైన రాంరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర్ రెడ్డిల కుటుంబం నుంచి వచ్చిన సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా భావించి ప్రచారంలో ముందంజలో నిలవాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ బలాన్ని ఈ ఎన్నికల్లో మరోసారి చాటిచెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమరెడ్డి, ఎంపీ రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య తదితరులు ప్రసంగించారు.

# దశల వారీగా నగర అభివృద్ధి

**మంత్రి తుమ్మల**
**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబర్ 10 :**

నగర పాలక సంస్థ పరిధిలో మౌళిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, నగర అభివృద్ధి పనులను దశల వారీగా పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. నగరంలోని 9, 12, 13, 14వ డివిజన్లలో నిర్మించిన నూతన సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ నగరంలో రానున్న రోజుల్లో దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రజాధనంతో చేపడుతున్న ఈ పనులన్నింటినీ అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించాలని, నిర్మాణాల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని అధికారులను, కాంట్రాక్టర్లను హెచ్చరించారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూరేలా పనులు ఉండాలని ఆయన సూచించారు. ఆయా ప్రాంతాల్లో ఇంకా ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలో గుర్తించి, ఆ వివరాలను సుడా చైర్మన్ పువ్వాడ దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు.



ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి ఒక్క పనిని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామన్నారు.ఖమ్మం నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన ప్రజలంతా సుఖసంతోషాలతో, పరస్పర సోదరభావంతో కలిసిమెలిసి జీవించేలా నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ ఐకమత్యంతో ఉంటూ నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా జీవించే వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, పలువురు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.70 కోట్లతో పోలేపల్లి అభివృద్ధి

**మంత్రి పొంగులేటి**
**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 10 :** పోలేపల్లి రూ. 4.65 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రెండు నూతన బిటి రోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఇందులో రూ. 2.42 కోట్లతో పోలేపల్లి నుండి దానవాయిగూడెం (వయా మున్నేరు) వరకు, రూ. 2.20 కోట్లతో పోలేపల్లి నుండి రామునిపేట వరకు బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పోలేపల్లి గ్రామంలో రూ. 70 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్య మిస్తోందని స్పష్టం చేశారు. సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక కార్యక్రమాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నామని తెలిపారు. పోలేపల్లి



ప్రజల సౌకర్యార్థం రాబోయే కొద్ది రోజుల్లోనే నూతన రేషన్ డీలర్‌ను ఏర్పాటు చేస్తామని, అర్హులైన ప్రతి పేదవానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్కూల్‌లో స్థల సమస్య ఉన్నందున, సమీపంలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నూతన పాఠశాల భవనాన్ని నిర్మిస్తామని వెల్లడించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, పిఆర్ ఈఈ మహేష్ బాబు,సర్పంచ్ బత్తిని మహేష్‌తో పాటు పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉద్యమకారులపై ఉక్కుపాదం

# నియంతృత్వ పాలనకు నిదర్శనం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 10 :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్న ఉద్యమకారులపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం తీవ్ర నియంతృత్వ విధానానికి నిదర్శనమని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సి.వై. పుల్లయ్య విమర్శించారు. గట్టయ్య సెంటర్ వద్ద సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా సి.వై. పుల్లయ్య మాట్లాడుతూ దేశంలో మనువాద పరిపాలనను సుస్థిరం చేసుకోవడానికే బిజెపి, ఆర్ఎస్ఎస్ లు అర్హులైన ఓటర్ల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఢిల్లీకి వస్తున్న ప్రజలను, నాయకులను అడ్డుకోవ





డానికి ఏకంగా 35 వేల మంది పోలీసు, పారామిలిటరీ బలగాలను దింపి, రవాణా వ్యవస్థలను నిలిపివేసి భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టడమేనన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జిరామయ్య, డివిజన్ కార్యదర్శి టి. ఝాన్సీ, పిఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. శిరోమణి, పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు కె. పృథ్వీ, జిల్లా అధ్యక్షుడు టి. లక్ష్మణ్, పీడీఎస్‌యూ, టీయూసీఐ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## మనసు మాట విందాం.. వివక్షకు తెరదించుదాం

**బీబీనగర్ ఎయిమ్స్‌లో మానసిక ఆరోగ్య వారోత్సవాలు**

**ముద్ర, బీబీనగర్:** మానసిక ఆరోగ్య సమస్యలపై సమాజంలో నెలకొన్న అపోహలను తొలగించడంతో పాటు బాధితుల అనుభవాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే లక్ష్యంతో బీబీనగర్ ఎయిమ్స్‌లో మానసిక ఆరోగ్య వారోత్సవాలను నిర్వహించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకు ఎయిమ్స్ మానసిక వైద్య విభాగం, నర్సింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. 'బాధితుల అనుభవాలను విందాం – నిజమైన గొంతుకలతో మార్పునకు శ్రీకారం చుడదాం' అనే నినాదంతో రంగవల్లులు, ఫేస్ పెయింటింగ్ పోటీలు, విద్యార్థుల మధ్య చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా మానసిక ఆరోగ్యంపై సోషల్ మీడియా ప్రభావం, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ల పాత్రపై వైద్య, నర్సింగ్ విద్యార్థులు ఆసక్తికరంగా చర్చించారు.మానసిక సమస్యలతో బాధపడుతున్న వారి పట్ల వైద్య సిబ్బంది మరింత సున్నితంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని వివరిస్తూ నర్సింగ్ సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేడియో ప్రసారాల ద్వారా మానసిక ఆరోగ్యంపై అవగాహన సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డీన్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, మానసిక వైద్య విభాగాధిపతి, అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. మానసిక సమస్యలపై వివక్షను తొలగించి, బాధితుల గొంతుకకు సమాజంలో గుర్తింపు కల్పించడమే ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశమని ఎయిమ్స్ మానసిక వైద్య విభాగం పేర్కొంది.





## ఖమ్మం కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబర్ 10:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన రాష్ట్ర పండుగ బతుకమ్మ సంబరాలు కలెక్టరేట్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఎంగిలి పూల బతుకమ్మను వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో అధికారులు, మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలతో సందడి చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రకృతిని, పూలను ఆరాధించే ఈ విశిష్ట పండుగ తెలంగాణ ప్రత్యేకతను చాటిచెబుతుందని, భావితరాలకు మన వారసత్వాన్ని అందించే గొప్ప వేడుక అని పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి 18 వరకు తొమ్మిది రోజుల పాటు శాఖల వారీగా ఈ వేడుకలు జరగనున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, సహజసిద్ధమైన పూలతో పర్యావరణహితంగా పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య, కలెక్టరేట్ కేర్ టేకర్ వెంకన్నతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కష్టకాలంలో నిలిచిన వారికే పట్టం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 10 :** కష్టకాలంలో తమ హక్కుల కోసం నిలబడ్డ వారికే ఆర్టీసీ కార్మికులు ఎన్నికల్లో పట్టం కట్టారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. సిపిఐ కార్యాలయంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఎంప్లాయిస్ యూనియన్ కూటమి విజయోత్సవ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు.అధికార పార్టీ ఎంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలతో ప్రచారం చేయించి ప్రలోభాలకు గురిచేసినా కార్మికులు లొంగలేదని, 50 శాతానికి పైగా ఓట్లతో ఎంప్లాయిస్ యూనియన్ కూటమిని గెలిపించారని తెలిపారు. ఈ విజయం తమపై బాధ్యతను మరింత పెంచిందని, ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ కార్మికులకు అన్యాయం జరగకుండా సాగాలని డిమాండ్ చేశారు. సిపిఐ, ఏఐటియుసి ఎల్లప్పుడూ కార్మికులకు అండగా ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాటి అప్పారావు, బి.ఎస్. రెడ్డి, పిల్లి రమేష్, మహ్మద్ సలాం, శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, అనిత తదితరులు పాల్గొన్నారు.





## నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల కేంద్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ నవీన్ కుమార్, ఎస్సై అజ్మీర రమేష్‌లు నిర్వాహక కమిటీ సభ్యులకు . ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవిమాత ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను సంఘం సభ్యులు శనివారం ఎస్సైలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్కు అంతరాయం కలుగకుండా చూడాలని తెలిపారు. ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్త వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దొడ్డి సుధాకర్, వీరమళ్ల వెంకటయ్య, మిర్యాల శ్రీనివాస్, శంకర్, దుండిగళ్ల అశోక్ తదితరులున్నారు



## స్మార్ట్ కిడ్జ్ లో బతుకమ్మ, దసరా వేడుకలు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబర్ 10 :** స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో బతుకమ్మ, దసరా వేడుకలు అత్యంత వైభవంగా, కోలాహలంగా నిర్వహించారు. వేడుకల్లో పాఠశాల చిన్నారులు తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో పాఠశాలకు చేరుకున్నారు. ప్రాంగణంలో బతుకమ్మలను కొలువుదీర్చి, వాటి చుట్టూ చేరి "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో" అంటూ చప్పట్లు, తాళాల నడుమ జానపద గేయాలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రత్యేకంగా రూపొందించిన పల్లకి బతుకమ్మ, నెలవంక బతుకమ్మ, తులసికోట బతుకమ్మలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.సంబరాల ప్రారంభంలో చిన్నారులు గౌరీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ తర్వాత దసరా వేడుకలను కూడా సాంప్రదాయబద్ధంగా జరిపారు. అమ్మవారికి విశేష పూజలు అందించిన అనంతరం ఆకట్టుకునేలా రావణ దహన ఘట్టాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపమైన బతుకమ్మ పండుగ ప్రపంచవ్యాప్తంగా మన రాష్ట్ర ఖ్యాతిని చాటిచెబుతోందని తెలిపారు. ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి విశిష్టతకు ఈ పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ప్రేమిస్తూ రక్షించుకున్నప్పుడే మానవ మనుగడ సాఫీగా సాగుతుందనే గొప్ప సందేశాన్ని చిన్నారుల్లో పెంపొందించేందుకే పాఠశాలలో ఈ వేడుకలను నిర్వహించామని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలం, నాగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని ఏంబావి కి చెందిన షేక్ జమాల్ (32) విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందాడు. శనివారం తన వ్యవసాయ భూమిలో నీరు పెట్టేందుకు ఉదయం సుమారు 07:00 గంటలకు పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో సాగునీటి ఇనుప పైపులను ఎత్తి మరోచోటికి మారుస్తుండగా, పైపులకు విద్యుత్ ప్రవహించటంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినాడని, కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడిని భువనగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు మధ్యాహ్నం 13:41 గంటలకు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి భార్య షేక్ నిష్మా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేరకు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 11.10.2026
www.mudranews.in | @mudranews



### నిద్రలేమికి కషాయం పనిచేస్తుందా?



దానిమ్మ ఆకుల కషాయం తాగితే ప్రశాంతమైన నిద్ర పడుతుందనే ప్రచారం ఉన్నప్పటికీ, దీనికి బలమైన మానవ అధ్యయనాల ఆధారాలు లేవు. నిద్ర సమస్యలు తగ్గాలంటే క్రమబద్ధమైన నిద్ర వేళలు పాటించడం ముఖ్యం.

# అమ్మవారి ఉత్సవాలకు అంతా సిద్ధం

## ఏడుపాయల, చిట్కూల్ ఆలయాలు ముస్తాబు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

"అమ్మలఁ గన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాలఁ బె ద్దమ్మ, సురారులమ్మ కడు పాఱడి వుచ్చినయమ్మ, తన్నులో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ, దుర్గ, మాయమ్మ, కృపాబ్ధి యిచ్చుత మహత్త్వకవిత్వ పటుత్వ సంపదల్"









అమ్మ దయలేనిదే ఏమి జరగదు... అమ్మ దయ ఉంటే అన్ని జరుగుతాయి.. శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 11 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రసిద్ధ అమ్మవారి పుణ్య క్షేత్రాలతో పాటు పట్టణాలు, గ్రామాలలో అమ్మవారి ఉత్సవాల నిర్వహణకు సిద్ధం చేశారు. 9 రోజుల పాటు వివిధ రూపాలలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారు. పదవ రోజు విజయ దశమి రోజున శ్రీ రాజ రాజేశ్వరిగా అభయమిస్తారు. అయితే కొందరు విజయవాడ, మరి కొందరు శ్రీశైలం వారి విధానంలో అమ్మవారిని అలంకరించి పూజిస్తారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగసానిపల్లి మంజీరా నదిలో వెలసిన శ్రీ ఏడుపాయల వన దుర్గ అమ్మవారి సన్నిధిలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుపుతారు. ఆలాగే చిట్కూల్ చాముండేశ్వరి ఆలయం, పేరూరు శ్రీ సరస్వతి మాత ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. మెదక్ రేణుక మాత, కాళికా దేవి ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయి. మండపాలను వైభవంగా సిద్ధం చేసి అమ్మవారి తీరొక్క, ఎత్తైన ప్రతిమలను ప్రతిష్టించనున్నారు. ఏడుపాయలలో.....ఏడుపాయలలో గణపతి పూజ అఖండ దీపారాధనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. బాలా త్రిపుర సుందరి దేవి (శైలపుత్రి), శ్రీ గాయత్రీ దేవి ( బ్రహ్మచారిణి), శ్రీ అన్నపూర్ణ దేవి (చంద్రమంటా), శ్రీ మహాచండి (కూష్మాండ), శ్రీ మహాలక్ష్మి (వృందనూత), శ్రీ సరస్వతి దేవి కాత్యాయని), శ్రీ లలితాత్రిపురసుందరి దేవి (కాళరాత్రి),శ్రీ దుర్గాదేవి (మహాగౌరి),శ్రీ మహిషాసుర మర్ధిని దేవి (సిద్ధిరాత్రి),శ్రీ రాజ రాజేశ్వరి సహిత వన దుర్గ దేవి (దసరా) దర్శనం ఇస్తారు. 15న గురువారము రోజున ఉ. 11 గంటలకు శ్రీ వనదుర్గా భవాని మాతకు బోనాలు ఉత్సవం ఉంటుంది. 19న ఉ. 11 గంటలకు సువాసిని పూజ, చండీ హోమము జరిపిస్తారు. వనదుర్గ అన్న ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో నవరాత్రులలో ప్రతి నిత్యం అన్నప్రసాద వితరణ చేస్తారని ఈఓ వీరేశం తెలిపారు. చిట్కూల్ లో....మెదక్ జిల్లా చిలప్ చెడ్ మండలం చిట్కుల్ శివారులో మంజీర నది తీరాన కొలువైన చాముండేశ్వరి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబయింది. దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్ద ఆలయంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో చాముండేశ్వరి అమ్మవారు శక్తి స్వరూపినిగా వెలుగొందుతున్నారు. 9 అడుగుల ఎత్తు, 18 చేతులతో భక్తులకు దర్శనమిస్తుంది. నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈనెల 11నుండి 19 వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వాహణకు అన్ని ఏర్పాటు చేసినట్లు చాముండేశ్వరి సేవా సమితి సభ్యులు, ఆలయ పూజారి ప్రభాకర్ శర్మ తెలిపారు. శ్రీ చాముండేశ్వరి అమ్మవారు తొమ్మిది రోజుల పాటు ఒకే అవతారంలో పూజలు అందుకోవడం ఇక్కడి ప్రత్యేకత. ఆదివారం నుండి ప్రతిరోజు ప్రత్యేక పూజలు, మహా పూజ మహా నివేదన, హారతి, తీర్థ ప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు. అమ్మవారిని దర్శించుకోవడానికి హైదరాబాదుతో పాటు ఇతర రాష్ట్రాల నుండి భక్తులు తరలివస్తారు.

## ఎంగిలి పూల బతుకమ్మ





ప్రకృతిలో లభించే పూలను పూజించే బతుకమ్మ పండుగ మొదలైంది. మహాలయ అమావాస్య సందర్బంగా ఎంగిలి పూల బతుకమ్మ తయారు చేసి మహిళలు ఆడిపాడారు. మెదక్ జిల్లా కేంద్రంతో పాటు పట్టణం, గ్రామాలు, వాడవాడల్లో తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి అమ్మవారిని కొలుస్తున్నారు. వాడవాడల్లో పండుగ సందడి నెలకొంది. పట్టణంలోని కోదండ రామాలయం, నవాబుపేట, వీరహనుమాన్ కాలనీ, పిట్లంబేస్, కోలిగడ్డ తదితర చోట్ల బతుకమ్మ ఆడి పాడారు. - ముద్ర ప్రతినిధి, మెదక్:

# ఢిల్లీలో సిపిఎం నాయకుల అరెస్ట్ కు నిరసన

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఢిల్లీలో శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిటి బ్యూరో సభ్యులు, జాతీయ నాయకుల పైన, ప్రజలపైన ఢిల్లీ పోలీసులు విస్తృతంగా సాగించిన అణచివేతను, అక్రమ అరెస్టులను సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ , బట్టుపల్లి అనురాధ తెలిపారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని జగ్జీవన్ రామ్ చౌరస్తాలో నిరసన చేశారు. ఈ సందర్భంగా నర్సింహ, అనురాధ మాట్లాడుతూ పెద్ద ఎత్తున ఓటర్లను ఓటు హక్కుకు దూరం చేయడానికి, ఇతర ఎన్నికల సంస్కరణలకు దారితీసిన ఎస్ఐఆర్ (సార్ ) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు నిరసనలు చేపట్టారని తెలిపారు. దీనికి భయపడిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఢిల్లీ నగరంలో వర్చువల్ కర్ఫ్యూ విధించడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, మెట్రో స్టేషన్లను మూసివేయడం, ఇతర రవాణా మార్గాలను నిలిపివేయడం వంటి అణచివేత చర్యలకు పాల్పడడం దుర్మార్గమైన చర్యలని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ , దయ్యాల నరసింహ, నాయకులు ఈర్లపల్లి ముత్యాలు,



బుర్రు అనీల్, ఎండి సలీం, గౌరిగ సోములు, నర్సింహ పాల్గొన్నారు.

### సీఈసీ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దహనం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 10 :** ఢిల్లీలో సీపీఎం జాతీయ నాయకులు, విద్యార్థులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాగిస్తున్న నిర్బంధాన్ని, అక్రమ అరెస్టులను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దగ్గం చేశారు. సుందరయ్య భవన్ నుండి సరిత క్లినిక్ వరకు సాగిన ఈ నిరసన ర్యాలీ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. దిష్టిబొమ్మను దహనం చేశారు.సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం జాతీయ కార్యదర్శి ఎం.ఏ. బేబీతో పాటు ఇతర నాయకులను, విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఓట్ల సర్వే పేరుతో దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లను తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని, ఓట్ల దొంగతనానికి పాల్పడిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ ముట్టడికి వెళ్లకుండా వందలాది రైళ్లను రద్దు చేసినా ప్రజా ఉద్యమాలను కేంద్ర ప్రభుత్వం ఆపలేదని, అరెస్టు చేసిన నాయకులను, విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలని స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, ఎమ్. సుబ్బారావు, జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, మీరా, బండారు రమేష్, జాజిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా కేంద్రం ఏర్పడి పదేళ్లు

### కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలతో మారిన రూపురేఖలు ఇంకా కావాల్సింది ఎంతో..





**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా కేంద్రం ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకుంది. 1980లో ఇందిరాగాంధీ మెదక్ ఎంపీగా గెలిచి ప్రధానమంత్రి కావడంతో దేశవ్యాప్తంగా ఈ ప్రాంతానికి గుర్తింపు లభించింది. అయితే మెదక్ జిల్లా పేరున్నప్పటికీ.... జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఉండేది. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంతోపాటు జిల్లా అధికారులంతా అక్కడే ఉండేవారు. పాలన అంతా అక్కడి నుండే జరిగేది. మెదక్ జిల్లా కేంద్రం కావాలని అనేక పోరాటాలు సాగించారు. రాందాస్ నిరాహార దీక్ష కూడా చేపట్టారు. కానీ 2014లో తెలంగాణ రాష్ట్రం సిద్దిస్తే, అప్పటి సీఎం కేసీఆర్ సారథ్యంలో కొత్త జిల్లాల ఏర్పాటుతో 2016 అక్టోబర్ 11న మెదక్ జిల్లా కేంద్రం ఏర్పాటైంది. మొదటి కలెక్టర్ గా భారతి హొళ్ళికేరి, ఎస్పీగా చందనా దీప్తి వచ్చారు. ఇంజనీరింగ్ కళాశాలలో కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. 2023 ఆగస్టులో ప్రభుత్వం సొంత కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయం నిర్మించగా కెసిఆర్ ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయం, జిల్లా కోర్టు ఏర్పాటయ్యాయి. జిల్లా కేంద్రం కావడం వల్ల ప్రజలకు దూరభారం తగ్గడంతోపాటు ఇక్కడి నుండి పాలన సాగుతుంది. ఇంకా కొన్ని జిల్లా కార్యలయాలు మెదక్ కు రావాల్సి ఉంది. వాటి విషయంలో ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కొత్త జిల్లా కేంద్రంతో పాటు ఆరు కొత్త మండలాలు ఏర్పడ్డాయి. తహసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్, ఇతర మండల కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉంది. నవోదయ, కేంద్రీయ విద్యాలయం మంజూరుతోపాటు మరిన్ని రైళ్లు రావాల్సి ఉంది. జిల్లా కేంద్రం అయినప్పటికీ ప్రయాణీకుల అవసరం మేరకు అన్ని ప్రాంతాల్లో బస్సులు నడవడం లేదు. ఇటీవల కలెక్టర్ ప్రతిమా సింగ్ పర్యాటకంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఏడుపాయల, మెదక్ ఖిల్లా, చర్చి, పోచారం అభయారణ్యం, నర్సాపూర్ ఫారెస్ట్ వద్ద పర్యాటకులను ఆకర్శిస్తున్నారు. ఇక్కడ మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

# బస్సు 'చక్రం' తిప్పింది...'బాణం' గురి తప్పింది

### మెదక్ లో మొదటిసారి గెలిచిన ఎంప్లాయిస్ యూనియన్

### జీర్ణించుకోలేకపోతున్న తెలంగాణ వర్కర్స్ యూనియన్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ ఆర్టీసీ డిపో చరిత్రలో ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ మొదటిసారి ఘన విజయం సాధించింది. ఆర్టీసీ గుర్తింపు ఎన్నికలు శుక్రవారం జరిగిన విషయం తెలిసిందే. 244 మంది కార్మికులకు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రీజియన్, రాష్ట్ర స్థాయిలో ఎంప్లాయిస్ యూనియన్ విజయం సాధించింది. రీజియన్ స్థాయిలో ఎంప్లాయిస్ యూనియన్ కు 132, టిడబ్ల్యూయూకు 104 ఓట్లు వచ్చాయి. స్టేట్ లో ఎంప్లాయిస్ యూనియన్ కు 140, టిడబ్ల్యూయూకు 98 ఓట్లు వచ్చాయి. మెదక్ డిపో అధ్యక్షులుగా నరేందర్, కార్యదర్శిగా సర్వన్, కోశాధికారిగా అనంతం గెలుపొందారు. ఎంప్లాయిస్ యూనియన్ విజయం సాధించడం పట్ల రీజియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవి డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ కిష్టయ్య, కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఖంగుతిన్న టిడబ్ల్యూయూఆర్టీసీ కార్మిక సంఘం ఎన్నికల్లో మెదక్ డిపో చరిత్రలో ఎంప్లాయిస్ యూనియన్ గెలిచిన సందర్భం లేదు. 1981 నుండి ఆర్టీసీలో కార్మిక గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో మెదక్ రీజియన్ లో నేషనల్ మజ్దూర్ (ఎన్ఎంయూ)కు ఎంప్లాయిస్ యూనియన్ మధ్యే గట్టి పోటీ ఉండేది. కానీ ప్రతిసారి ఎన్ఎంయూ గెలుపు నల్లేరు మీద నడక మాదిరి ఉండేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016 నుండి ఇప్పటి వరకు పదేళ్లుగా ఎన్నికలు నిర్వహించలేదు. తాజాగా టీజిఎస్ ఆర్టీసీ కార్మిక గుర్తింపు ఎన్నికలు జరిగాయి. గత చరిత్రను తిరగ రాస్తూ కార్మికులు విలక్షణ తీర్పునిచ్చారు. మెదక్ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ గెలుపును తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ) జీర్ణించుకోలేకపోతుంది. ఇందులో తలపండిన కార్మిక నాయకులున్నప్పటికి అసలు పోటే కాదనుకున్న ఎంప్లాయిస్ యూనియన్ గెలుపపొందడం విశేషం. టీడబ్ల్యూయూకు అధికార కాంగ్రెస్ పార్టీ, నిరంతరం ప్రజా, కార్మిక ఉద్యమాలు చేసే సీఐటీయూ బహిరంగ మద్దతునిచ్చింది. స్థానిక కాంగ్రెస్, సిపిఎం నేతలు ప్రచారం చేశారు. అయినా ఓటమి చెందడంతో ఎక్కడ లెక్క తప్పిందని బేరీజు వేసుకుంటున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ లో సీనియర్ కార్మిక నాయకులు లేకపోయినా, చక్రం తిప్పే కింగ్ మేకర్లు లేకున్నా విజయం సాధించడంతో ఆనందంలో మునిగితేలుతున్నారు. ఈ ఫలితం కొందరికి చెంప పెట్టు అనడంలో సందేహం లేదు.

# మెదక్ లో కాగడాల ప్రదర్శన

### హాజరైన ఎమ్మెల్యే సునీత, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, పద్మ, సుభాష్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా కేంద్రం ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, జెడ్పి మాజీ చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్లు బట్టి జగపతి, ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్, జితేందర్ గౌడ్, ఏఎంసి మాజీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, లింగారెడ్డి, గడ్డమీది కృష్ణాగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555